ఎద సొద

(వచన కవితా సంపుటి)



కవితా ప్రసాద్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పరాభవ ఉగాది పురస్కార స్వీకృతి



తెలుగు తల్లి జ్ఞాపిక

ఎదసొద

(వచన కవితలు)

రచన

కవితా ప్రసాద్

ఎదసొద
రచన: కవితా ప్రసాద్

ప్రథమ ముద్రణ: ఏప్రిల్ 2026
ప్రతులు: 100

ప్రాప్తిస్థానం: Kavitha Prasad,
73-18-8/1F, S2 - Sree Nandanam Apt.,
Sree Balaji St., (Near Venkateswara Temple),
A.V. Apparao Road,
Rajamahendravaram-533103 (AP)
✆: 9490168907

రూపకల్పన: పంతుల విట్టుబాబు, హైదరాబాద్ ✆85550 82034
ముద్రణ: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్ ✆9866661478

జోస్యుల రామచంద్ర శర్మ (జోరాశర్మ)
విశ్రాంత BSNL ఉన్నతాధికారి
ప్రముఖ కవి, వక్త, సాహితీ విశ్లేషకుడు
రాజమహేంద్రవరము.



ఎద (కవితా) సుధ

కవితా వంశోద్భవుడై తండ్రి బ్రహ్మశ్రీ కామేశ్వర శర్మ గారి వారసత్వంగా అటు సారస్వతాన్నీ, ఇటు జ్యోతిష ముహూర్త వాస్త్వాది శాస్త్ర పాండిత్యాన్ని అంది పుచ్చుకొన్న సుపుత్రుడు శ్రీ కవితా ప్రసాద్. రసాయన శాస్త్రపారంగతునిగా ప్రసిద్ధ సంస్థ ONGC లో ఉన్నతాధికారిగా ఉద్యోగించి విశ్రాంతజీవనంలో అవిశ్రాంతంగా తన కవితా వ్యవసాయాన్ని సాగిస్తూ ఫలసాయాన్ని వివిధ రూపాలలో - కథా, గద్య, పద్య సంపుటాలుగా వెలువరిస్తున్న కవితా కృషికుడు. అతని వ్యక్తిత్వంలో, కవిత్వంలో ఒక వైలక్షణ్యం గోచరిస్తుంది - అది పద్యమైనా గద్యమైనా- కథైనా.

సహజంగా అతని **ఎద** యెల్ల ఆధ్యాత్మిక భావ సంపదతో నిండియుండటం వలన ఐహిక విషయాలు **సొద**గా అంటే ప్రయోజనం లేని ముచ్చటగా కనిపించినా, ఆ రెంటినీ సమన్వయించుకొని ఈ **ఎద సొద** కవితా సంపుటి రూపొందించినట్లుగా నా కన్పిస్తుంది. ఇది పరిణత వయస్సుకు తగ్గ భావౌన్నత్యంగా భావించినా ఇతర వయస్కులకూ అది ఆలోచనీయమే! ఆదర్శప్రాయమే!

ఈ కవితా సంపుటిలో పెద్ద వచన కవిత లున్నాయి. పచన కవితలున్నాయి. మినీ వచన కవితలున్నాయి. మినీ కవితా చమత్కారాలు ఉన్నాయి. ఆపైన చిత్రాలకు (బొమ్మలకు) తన భావుకతను మేళవించి వన్నె తెచ్చిన సుందరమైన చిత్రకవితలు ఉన్నాయి. అక్కడక్కడా సందర్భోచితంగా మెఱుపులు విరజిమ్మి అలరించే పద ప్రయోగాలు విచిత్ర విలక్షణ ప్రయోగాలూ ఉన్నాయి. ఆధ్యాత్మిక, భావుక, సామాజిక స్పృహాత్మకమై గుబాళిస్తున్నాయి.

ముందుగా "కవితా! ఓ కవితా!!" (17) ను పరిశీలిద్దాం. ఇది "కవితా నా యింటి పేరు, కవిత నా రక్తం, కవిత నా సూక్తం" అంటూ, కవి అంటే ఎవడో చక్కగా నిర్వచించి చూపి, "కవిం నమామి - కవితా స్మరామి" అని ముక్తాయించి కవితా

దినోత్సవ వేళ కవితను స్మరించి కవులకు నివాళి (అభినందన) అందించటం విశేషం. కవికి ఇచ్చిన నిర్వచనం చూద్దాం. "కనిపించిన దాని వెనుక కనిపించనిదీ, వినిపించినదాని వెనుక వినిపించనిదీ, కలంపోటుతో, నోటి మాటతో, వెల్లడించి, తల్లడిల్లకుండా, తలాడించేలా చేసేవాడే కవి, కవులలో రవి" అంటాడు. అసలైన కవికి ఇంతకంటే గొప్ప కిరీటం ఏం కావాలి? ఉత్సవ వేళ కవి సన్మానం ఇది. కవితా సత్కారం ఇది. ఈ లక్షణాలను తన కవితలన్నింటి నిండా ప్రతిబింబింపజేసాడు కూడా. ఒక మినీ కవిత "ఓం శాంతిః" (12) లో తన గుఱించి చమత్కరించుకొన్న తీరు చూస్తే నిజమే అనిపిస్తుంది. అంటే కవి లక్షణం - వ్యంగ్య కవితా చమత్కారం లక్ష్య లక్షణ సమన్వయంగా భాసిస్తాయి.

"ఔను! నాన్న వెనుకబడ్డాడు!" (14) అనే కవితను చూడండి. నాన్న వెనుకబడటం గుఱించి ఈ మధ్య కాలంలో చాలా కవితలే వచ్చాయి. ఐతే నాన్న వెనుకబాటును తనదైన శైలిలో పురాణగాథల అనుసంధానంతో వర్ణించి 'కొసమెరుపు'గా "అసలు బిడ్డ తొలి పలుకుగా అమ్మ అన్నప్పుడే వెనుకబడిపోయాడు అమాయకపు నాన్న" అంటాడు. తలలాడించే రసాత్మక వాక్యం- వాక్యం రసాత్మకం కావ్యం- రవి కాంచనిదై కవి కాంచిన సన్నివేశం అద్భుతమే!

పైన అనుకొన్న ఎద-సొద సమన్వయంగా ఈ సంపుటిలో మనల్ని అలరించి ఆలోచింపజేసే చిత్ర కవితలున్నాయి. ఒక చిత్రానికి తగ్గ కవిత వ్రాయటం దీన్లో ప్రత్యేకత. యథాతథంగా చిత్రాన్ని దర్శించి వర్ణించి చెప్పే తీరు అంటే బాహ్య వర్ణన ఒకటైతే దాని లోతులను స్పృశించి కవి తన భావుకతతో మన ఎదను స్పృశించే కవితా నైశిత్యం మఱొకటి.

కవి ఒక నవజాత శిశువు చిత్రాన్ని చూసి స్పందించి కవితావిష్కరించిన "కెవ్వింపు" (22) అనేది ఈ కోవలోదే. ఇక్కడ నవజాత శిశువు మాత్రమే చిత్రంలో కనిపిస్తుంటే, కనిపించని ఇతర సన్నివేశాల్ని ఆ శిశువు స్వగతాన్ని కవి మేళవించి పలికిన మేల్బంతి ఈ చిత్ర కవిత.

పసిబిడ్డ ఏడవటం లేదని డాక్టరు గిచ్చి కెవ్వుమనిపించటం (కవితకు వినూత్న శీర్షిక "కెవ్వింపు" కూడా అయ్యింది). ఆ శిశువు ఏడిస్తే అక్కడ చేరిన ఇతర పరివారానికి ఆనందో బ్రహ్మ. అంతేకాదు. శిశువు మనోగతం ఎలా ఉందో చూడండి.

"డాక్టర్ కన్నా సెన్సు ఉండక్కర్లే?
గిల్లి గిల్లి కెవ్వించక పోతే

గిలిగిలి పెట్టి నవ్వించొచ్చు గదా!
తర్వాత్తర్వాత ఎలా ఏడ్చినా కనీసం
జీవిత ప్రారంభమైనా నవ్వుతూ చేసేవాణ్ణి!"

దీని కనుబంధంగా "శపథం" (66) మినీ కవితను చదువుకొని మనిషి భూమి మీదకు రాకలో ఆనందాన్ని, పోకలో విషాదాన్ని ధ్వనిగా శీర్షికలో, ముక్తాయింపులో గమనించవచ్చు.

మరో చిత్ర కవిత "ఆనందో బ్రహ్మ" (4). చిత్రం సామాన్యంగా ఉన్న బాలిక చిత్రం. "అనిమిత్త హాసం" తో! అందులోంచే తన ఆధ్యాత్మిక భావ సంపదనూ, భావుకతనూ జోడించి కవితగా మలిచి ఆవిష్కరించిన సన్నివేశం చూడాలి. నిజానికి ఏ చిత్ర కవితనైనా "చూసీ చదివీ - చదివీ చూసి" అనుభూతి చెందాలి. ప్రతి వాక్యంలోనూ ఆధ్యాత్మికతను వికసింపజేస్తూ సచ్చిదానంద అమృతాస్వాదనంగా - పరమహంసల దహరాకాశ దీపం - ఇంకా చెపితే పెంజీకటి కవ్వలి వెలుగుల కిరణం - వర్ణాలన్నీ కలిసిన వర్ణనాతీత వర్ణం! అంతేనా?! ఇది ఆనందో బ్రహ్మ! ఇది బ్రహ్మాస్మిగా ఆ హాసంలో ఉబికిన అధ్యాత్మ భావనా రామణీయకత ఆలోచనామృతం!

అలాంటిదే "అహోపుఋషిక" (1). మొట్టమొదటి చిత్రకవితలోనే తన విలక్షణత్వం చూపెట్టాడు కవి! కుటుంబ హర్మ్యానికి అనాదిగా పునాదిగా కాళ్ళూ చేతులు స్తంభాలుగా అవధి లేని హృదయాకాశమే కప్పుగా ఓ పురుషుడా నువ్వంతేగా" - అంటూ తన భావుకతను చిత్రంనుండి కవితగా మలిచిన ఫణితి హృద్యం. బొమ్మలో ఒక పురుషుని కాళ్ళు చేతులు ఆధారంగా భార్య బిడ్డను ముద్దాడుతున్న చిత్రాన్ని నిశితంగా గమనించాలి. శీర్షిక ఆలోచింపజేస్తుంది కవితా లాగానే! అహోపురుషిక ఒకటే పదం. అంటే పురుష సామర్థ్య (అహం)భావం. శీర్షికలోనూ చమత్కార వైవిధ్యం! పురుషిక లో రు ను ఋ గా చేసి కుటుంబ యజమానిని ఋషి గా కూడా ధ్వనింపజేసాడు కవి! అహోకవిపురుషికా!

అలాగే "టెంక బాంగ్" (31), "అంతిమయాత్ర"(72) చిత్రకవితలే! ఇలాంటి కవితలు వ్యాఖ్యానం కంటే ఎకాఎకి ఆస్వాదనమే ఆనందాన్ని కల్గిస్తాయి. చీకి పారేసిన ఒక మామిడి టెంక చిత్రాన్ని ఆసరాగా ఆధారంగా అల్లిన కవిత నిజంగా "బిగ్ బాంగే!" ఈ కవితలో కొసమెరుపు "ఆమ్ర రసామృతం పంచే మోహిని నౌతా!" అనటం రసపుష్టిని చేకూర్చింది. అంతిమయాత్ర చిత్రకవిత రచనతో పాటు

ముక్తాయింపు కవితను రసప్లావితం చేసింది. కాలుతున్న కండెలు "శత్రురాజులకు చిక్కకుండా ఆత్మాహుతి చేసుకొంటున్న అంతిపురి అతివల్లా" అంటూ పండించిన భావుకత కవిప్రతిభకు తార్కాణమే!

వచన కవితలలో "దర్శనం"(40) అనే వచన కవిత కవిగారి శైలిలో పచన కవిత. వేదాంతంలో "నేతి-నేతి" విచారణలోని రెండక్షరాలు వేరు. అంతర్ముఖంగా కవి అన్వేషణలో రెండక్షరాలు వేరు. అవి "దయ". భూతదయయే. చేతులు జోడించి కవి ప్రార్థన కూడా నితాంతాపార భూతదయనే దయచేయించమనే! అపుడు పరమాత్మ "భగవంతుడవయ్యావు! తథాస్తు! ఇక నువ్వూ నేనూ ఒకటే!!" అన్నాడు. పరమాత్మ కూడా దయా సముద్రుడే కదా! అదే త్వమేవాహం. తదనంతర స్థితి తాదాత్మ్యమే కదా! అందుకే కవికి పరమాత్మ ప్రకాశం ఆవేశించిందనిపించింది. వేదాంత విచారణను కొత్త కోణంలో వినూత్న దర్శనంగా అలతి అలతి పదాలతో ఆవిష్కరించిన ఈ కవిత ఆలోచనామృతం.

"నాతి చరామి" (35) పెండ్లి ప్రతిజ్ఞను ఆధునికంగా విశ్లేషించి సందేశాత్మకం చేసిన వచన కవిత. "...అసలు పెండ్లాడాలనుకొనే ముందు వేయి లక్షసార్లు ఆలోచించు!" ఎందుకట? అంటే "న భర్తు ర్న భార్యా స్వాతంత్ర్య మర్హతః!" అనగా భార్యా భర్తలిరువురికీ స్వాతంత్ర్యం ఉండబోదు. వివాహవ్యవస్థ బంధంలో ఉండి పోవాల్సిందే. అందుకు సిద్ధపడితేనే పాణిగ్రహించండి అనేది కవి సందేశం.

పది రూపాయల నాణెం "పది" లంగా (49) చలామణిలోకి తిరిగి వచ్చిన సందర్భాన్ని చిన్న వచన కవితగా మలచి చూపిన వైనం కూడా "నాణె" మైనదిగా మనం గుర్తించవచ్చు. తప్పిపోయిన మనిషిని గుర్తించి కుటుంబ సభ్యులతో కలిపితే వచ్చే పది రూపాయల నాణెం అంతరంగ హర్షాతిరేకాన్ని మనమూ పంచుకోవచ్చు.

"సెల్ఫీ" కథాకవిత (70) సంభాషణగా సరదాగా చెప్పినట్లున్నా పరమాత్మ దృష్టిని AI సృష్టిని కలబోసి చెప్పిన నవ్య కవితా ప్రక్రియ. తత్వబోధకమే!

మినీ కవితా చమత్కారాలు

ఈ సంపుటిలోని మినీ కవితలన్నీ మినీ కవితా లక్షణాలను పుణికిపుచ్చుకొని ఉన్నాయి. క్షప్తత, గాఢత, మెరుపులు, చమత్కారాలు, కొసమెరుపు విశేషాలు, శీర్షికావైభవంతో సుసంపన్నంగా. మచ్చుకు కొన్ని.

"ఫటాఫట్" (51) ..."సహస్రారం ఫట్" కొసమెరుపు. రోగి నుండి భోగి నుండి యోగి వరకూ చెప్పిన చక్కని మినీ కవిత! ఇది వినూత్న "తాపత్రయం".

"సౌమనస్యం" (59) అంటే మంచి మనసుకు గుండెతోటలోని సుమాలకు సంబంధించిన విలక్షణ శీర్షిక. గుండెలోని గులాబీలు, మల్లెలూ అందరికీ పంచుదా మంటే ఆఘ్రాణించటానికి "స" హృదయులెవరూ సిద్ధంగా కన్పించటం లేదట! ఎందుకనిట? "పాపం ఎవరి గుండె జబ్బుల్తో వాళ్ళు సతమతమౌతున్నారు"ట! అందుకనిట! కొసమెరుపు చమత్కారం రశ్మిమంతమైన శీర్శిక పరస్పరానుబంధంతో కవితకు వన్నె కూర్చాయి.

"నయనాభిరామం" (33). కళ్ళు ఎండిపోయాయి. మొబైల్ వాడటం మానేయ మని డా.సునయన చెప్పంగానే నేత్రరోగికి "కళ్ళలో నీళ్ళు గిఱ్ఱున తిరిగాయట". ఈ కవిత సునయనాభిరామం హృదయాభిరామం ఐంది. "అదంతే (2)"లో భగవంతుడు అల్లాటప్పాగా దర్శనాలిచ్చేసి "అతిపరిచయాదవజ్ఞా" అనే సూత్రబద్ధంగా చులకనైపోడు. అరిచి గీపెట్టినా అగుపించడు కాక అగుపించడు - అని ఊరుకోకుండా భగవంతుణ్ణి చక్కగా నిర్వచిస్తూ "పరోక్షమో అపరోక్షమో అనుభూతే కాని అనుభవానికి దొరకని మహానుభావుడు" గా తీర్పు చెప్పాడు కవి. కావటానికి ఇది చిన్న కవితే కాని ఆధ్యాత్మిక చింతనలోని భావుకతకు మంచి నిదర్శనంగా నిలుస్తుంది.

"కిమౌషధమ్?" (19) మంచి పరిపక్వత సాధించిన కవిత. ఇది ఎద సొదలు కలిసిన ఇహపర భావ సమన్వయాత్మక కవిత. వయసుతో పాటు అంతర్గత అవసరావయవాలన్నీ వ్యాకోచిస్తుంటే హృదయం మాత్రం "సంకోచిస్తోందట". "మందుని"కి (మందబుద్ధికి) "మందు" ఇవ్వమనటం అంటే అవిద్యావంతునికి భవనిర్మూలనౌషధం అనుగ్రహించమని దేవలోక వైద్యుడైన ధన్వంతరి రూప నారాయణుని ప్రార్థించటం ధ్వని ప్రయోగం మెచ్చుకోళ్ళకు తగినది.

ప్రత్యేకించి చెప్పాల్సిన విషయం - కవితా ప్రసాదుకు విలక్షణ పదాల వాడుకపై మక్కువెక్కువ. అది పద్యమైనా గద్యమైనా. ఒక శబ్దానికున్న అనేక పర్యాయ పదాల్లో ఒకటో రెండో ప్రాచుర్యంలో లేదా ప్రయోగంలో ఉంటాయి. కొత్తాఫీసరుగారు కొంతమంది సిబ్బంది పనిచేయడం లేదని గ్రహించి పని చేయించినట్లు వాడుకలో లేని పర్యాయపదాన్ని గుంజీలు తీయించి వాడకంలోకి తెస్తాడు. ఇది కవిసమ్రాట్ విశ్వనాథ వారి ప్రభావం అనిపిస్తుంది. మంచి పనే!

"ఎదగందు" (76) చంద్రునికి పర్యాయ పదం. ఎదలో మచ్చ గలవాడు అని. కవితను జాగ్రత్తగా చదివితే శీర్షిక శబ్ద సార్థకత తెలుస్తుంది. నెల"వంక"ను వెన్నెల పూసిన కత్తిగా అభివర్ణించటం హృద్యంగా ఉంది.

90 కవితలతో ఈ సంపుటి విరాజిల్లుతోంది. ప్రతి కవితా చదువుకొని చదువుకొని ఆలోచించుకొని ఆధ్యాత్మిక భావ సంపన్నమైన కవి హృదయాన్ని అందులోని లోతుల్ని చమత్ "కార"పు "తీపి"ని పట్టుకొని ఆస్వాదించదగినదే! పద్యకవిత్వంతో సమానమైన భావ శబ్దప్రయోగ విలక్షణతతో కూడిన కవితా సంపుటి ఇది. పది కాలాలపాటు పదిలంగా నిలిచే మంచి కవితా సంపుటిని అందించిన అస్మద్బాల్యమిత్రుడు శ్రీ కవితా ప్రసాద్ కు హృదయపూర్వక అభినందనలు. నిత్య కవితా కృషీవలుడు కనుక ఇటువంటి మఱిన్ని తన ఎద సుధలను **కవితా** ప్రియులకు **ప్రసాదిం**చాలని ఆశిద్దాం!

రాజమహేంద్రవరము — జొరాశర్మ

20.12.2025. — సెల్: 94406 84086

బొడ్డపాటి చంద్రశేఖర్
(విశ్రాంత) ఆంగ్లోపన్యాసకులు,
రచయిత, ఆంగ్లాంధ్ర సాహిత్య విశ్లేషకులు
విజయవాడ



ఎద సొదల అక్షరచిత్రాలు

కథ, నవల, నాటకం వంటి సృజన ప్రక్రియలకు, సృజనేతర వ్యాస ప్రక్రియకు ప్రత్యేక నిర్మాణపద్ధతి ఉన్నట్లే కవిత్వానికీ ఉంది. వ్యాస రచనకు కర్త, కర్మ, క్రియల వరుసలో వాక్య నిర్మాణం క్రమపద్ధతిలో ఉంటుంది. పద్యం, వచన కవిత్వం అలా కాదు. పదాలు స్థానాలు మారతాయి. ఒక విషయానికి సంబంధించిన ఆనందమో, విషాదమో ఆ భావోద్వేగాన్ని ఉన్నదున్నట్లు చెపితే అది కవిత్వం కాదు. కవిత్వరచన ఒక కళ. భావానికి ఒక ప్రత్యేక అమరిక ఇచ్చినప్పుడే అది కవిత్వం అవుతుంది. చెప్పదలచుకున్న భావానికి ఉపమలు, రూపకాది అలంకారాలు, అంత్య ప్రాసలు వంటివి కవితా సౌందర్యాన్ని ద్విగుణీకృతం చేస్తాయి.

కవిత్వంలో అనుభూతి ఉంటుంది. వేదన, ఆర్తి ఉంటాయి. సంతోషం, దుఃఖం ఉంటాయి. వ్యక్తీకరణ ఇతర ప్రక్రియలకు భిన్నం. తెలిసిన విషయాలే అయినా విలక్షణంగా, ఆసక్తికరంగా చెప్పటం లోనే కవి ప్రతిభ, నైపుణ్యం వ్యక్తమవుతాయి. కవి రాసే ప్రతి కవిత సందేశాన్నివ్వనవసరం లేదు. కాని, పఠి'తల'ను ఆలోచింప జేయాలి. అటువంటి ఆలోచనాత్మక, ఆసక్తికరమైన భిన్న అంశాల కవితా సుమహారం కవితా ప్రసాద్ గారి "ఎద సొద".

ఈ శీర్షిక చాలా అర్థవంతంగా, భావ స్ఫోరకంగా ఉంది. కవి తన మనసులో మెదిలే భావ పరంపరనే 'ఎద సొద 'అన్నారు.

90 కవితల కదంబం ఈ ఎద సొద. ఇందులో వ్యక్తిగత అనుభూతులు ఉన్నాయి. సామాజిక సమస్యలను చర్చించినవి ఉన్నాయి. వీటిలో కవి నిశిత సమాజ పరిశీలన, సంస్కృత పదాల ప్రయోగం వల్ల వారి భాషా నైపుణ్యం గొప్పగా వ్యక్తమవుతున్నాయి. కొన్ని కవితలలో వీరి హాస్య ప్రియత్వం, చమత్కారం ఆహ్లాద భరితంగా ఉంది.

"అతి పరిచయాదవజ్ఞా "ఎప్పుడైనా పరిచయాలు, రాకపోకలు అతిగా ఉంటే విలువ ఉండదు. పిలవగా పిలవగానూ, రాక రాక వస్తేనూ బాగా గౌరవిస్తాం. అదే రోజూ వస్తుంటే స్టూల్ అయినా చూపించమట. చివరగా దేవునికి ముడిపెట్టి, అందుకే అంతటా ఉంటాడు కాని అరిచి గీపెట్టినా కనిపించడు అంటారు "అదంతే" కవితలో. గొప్ప భావన. తెలిసిన విషయాన్నే విలక్షణంగా చెప్పారు.

మనసారా నవ్వటం బహుశా శైశవ దశలోనే సాధ్యమేమో! అది ఎంతో నైర్మల్యంతో, నిష్కల్మషంగా ఉంటుంది. వయసు పెరిగి, బుద్ధి తెలిసిన తరువాత కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరు అంతర్గత శత్రువుల ప్రభావంతో మనమెవరం నిండుగా, మనస్ఫూర్తిగా నవ్వలేం. వీటి ఊసే తెలియని పసినవ్వు పరమాత్మ ఆనందస్వరూపమే. నీలోత్పలం.. నల్ల కలువ...అన్న పద ప్రయోగం పక్కన చిత్రానికి చక్కని అన్వయం. "ఆనందో బ్రహ్మ" అనే కవిత చెప్పేదదే .

ముక్తి క్షేత్రం కాశీలో ఉన్నా వదలని భవబంధాలు, జిహ్వా చాపల్యం గురించి ఒక చురక "ఉర్వారుక మివ బంధనాత్ "చాలా మంచి కవిత.

ఈ సంపుటంలో అనువాద కవితలు కూడా ఉన్నాయి. Robert Drake కవిత Some times కు 'ఒక్కొక్కప్పుడు 'అని స్వేచ్ఛానువాదం చేసారు. ఇది ఎవరికైనా నచ్చే కవిత. గతం ఎప్పుడూ మధురంగానే ఉంటుంది.

"అప్పుడప్పుడు
గతించిన కాలంలోకి వెళ్లాలనుకుంటాను!
జరిగిపోయిన ఘటనలను ఏదో మార్చేద్దామని కాదు
ఒకటి రెంటిని మరలా అనుభూతి చెందాలని"

ఇలా సాగే కవిత ప్రతి ఒక్కరి మనసు పొరల్లో దాగి ఉన్న అనుభూతులను తట్టిలేపుతుంది.

నాన్న గురించి తెలుగులో చాలా కవితలే వచ్చాయి. దేనికదే ప్రత్యేకం. "ఔను వెనక బడ్డాడు కవిత"లో కుటుంబ భారాన్ని మోసే తండ్రి త్యాగాన్ని దశరథుడు, వసుదేవుడు వంటి పౌరాణిక పాత్రలతో పోల్చి చెప్పటం విశేషం. తెలుగు వ్యాకరణంలో సమాసాలతో కుటుంబాన్ని అనుసంధానిస్తూ చెప్పిన కవిత "కాల వ్యాకరణం".

నిజంగా, మనుషులం ఎప్పుడైనా అంతా బాగుంది అని సంతోషించేటప్పుడు ఏదో కష్టం వస్తుంది. కాస్త ప్రశాంతంగా ఉంది అనుకునే లోపలే దైవం అశాంతి

పాలు చేస్తాడు. ఇకనుంచైనా అటు దిటు ఇటు దటు సవరించమని, లేకుంటే నీ ప్రభుత ప్రమాదంలో పడుతుందనటం ఒక శక్తిమంతమైన వ్యంగ్యం.

మన వెన్నంటి ఉండే నీడ రకరకాలుగా ఎలా మారుతుందో చమత్కారంగా చెప్పిన కవిత "ఛాయా క్రీడ". ఒకసారి చిన్నగా, మరోసారి మిన్నగా ఉంటుంది. ఒకసారి ఎదురుగా నడుస్తుంది. ఇంకోసారి వెనుక, మరోసారి పక్కన నడుస్తుంది. నీడ ఆడే ఆటలు ఈ ఛాయా క్రీడ. మరి కవేం చేస్తారు దాని తిక్క కుదర్చాలని ఇంట్లోకి దూరితే అక్కడ అందరు తన నీడ లాంటి వారే. మంచి కొస మెరుపు ఉన్న కవిత ఇది. నీడ గురించే రాసిన "ఛాయా జాలం", "నీడకు తోడుగా" కూడా అర్థవంతమైన కవితలు.

పాత ఇంటిని పడగొట్టి అపార్ట్మెంటులు కట్టేటప్పుడు అంతవరకూ అనుబంధం పెంచుకున్న చెట్లను నరికివేస్తే ఎంత బాధగా ఉంటుందో "వృక్ష భారతం" కవిత తెలుపుతుంది.

"దీక్ష", "దర్శనం" తాత్విక దృష్టి ఉన్న కవితలు.

"వేడ్కోలు" కీ. శే. జాన్ నెట్టల్ రచించిన ఆంగ్ల కవిత A Prayar కు అనువాదం. ఒక వయసు వచ్చి వృద్ధాప్యంలోకి ప్రవేశించిన తరువాత ఇంటి విషయాలలో అతిగా జోక్యం చేసుకోకుండా ఉండటం ఎంత అవసరమో చెప్పే సందేశాత్మక కవిత.

"సభ రభస" నేటి సాహితీ సభల తీరును వ్యంగ్యంగా చెప్పిన కవిత. అష్టావధాన మహత్వాన్ని కుటుంబానికి సమన్వయిస్తూ తన పాత్ర ఎప్పుడూ అ'ప్రస్తుతమే' అనటం ఇందులోని చమత్కారం. ఇవి కొన్ని మచ్చుకి మాత్రమే. అన్ని కవితలు ఆసక్తికరంగా చదివించేవే.

ఈ కవితలలో భావానికి తగిన భాషాభివ్యక్తి, కవిత్వ నిర్మాణ పద్ధతి అభినందనీయం!

విజయవాడ   బొడ్డపాటి చంద్రశేఖర్

03.01.2026

@72

...ఈ వయసులో ఈ సొదెందుకూ? అంటే..

ఊర్కే కూర్చుంటే ఊరా? పేరా? అందుకూ! "ఘటం భింద్యాత్ పటం ఛింద్యాత్ కుర్యాద్వా గార్ధభ స్వరమ్! యేనకేనా ప్రుపాయేన ప్రసిద్ధః పురుషో భవేత్!" అన్న పెద్దల సుద్ది పాటించాలి కదా! ఐనా అన్పించిన దాన్ని ఎవరోకరికి విన్పించక పోతే ఎద రొదాళిస్తుంది. రోదిస్తుంది. చెవి సాచే వాడున్నా లేకున్నా సొగతాలను బయటకు వల్లించటం ఈ వయసులో జీవన నాటక లక్షణం కదా!

ఐనా దీన్ని చదవటం కోసం ప్రత్యేకంగా టైం కేటాయింపక్కరలేదు. అహర్నిశల్లో ఎప్పుడైనా సరే! విద్యున్మృగ్యమై T.V ప్రేలాపించనప్పుడో, ప్రయాణాల్లో బఠానీలు దొరకనప్పుడో, తోడికోడలుకు పుట్టిల్లు లేనివాళ్ళో, రాత్రి నిద్ర పట్టక దొర్లటానికి మంచం చాలనప్పుడో, సమయాన్ని సమయించటానికి దీని మీదో గుడ్లుక్కేయండి. పక్కాగా ఒక్కటైనా ఎక్కుతుందని నాకొక నిక్కు. గుడ్లక్.

ఈ సొదను తమ పత్రికల బాకాల ద్వారా విన్నవారికి వినిపించిన తెలుగులోకం, సరికొత్త సమాచారం, ప్రజాపత్రిక పత్రికా సంపాదకులకు కృతజ్ఞతలు.

తన మినీ కవితా భామినీ సౌందర్యంతో అరుదైన మహాకవి "ఆరుద్ర" అభినందన లందుకొన్న ప్రముఖ చిట్టి కవితల గట్టి మేటి కవి, సాహిత్య శీలి, సరస సౌజన్య మతి, శ్రీ జోరాశర్మ గారు. మును మాటను వి(క)న విందుగా అందించిన వారికి ఎద నిండు నమస్సులు. శతాధిక కృతజ్ఞతలు.

ప్రసిద్ధ ఆంగ్లాంధ్ర సాహితీ విశ్లేషకులు, ఉపన్యాసకులు, కాలమిస్టు, పత్రికా రచయిత, విశ్రాంతాంగ్లోపన్యాసకులు, సుహృన్మతి, శ్రీ బొడ్డపాటి చంద్రశేఖర్ గారు తమ అమూల్య స్పందనను అక్షరాకృతిగా ఆవిష్కరించి అందించారు. వారికి ఆత్మీయాభివందన పరశ్శతము.

అందంగా అచ్చు (DTP) కూర్చటంలో అచ్చోసిన కవివృషభుడు సన్మిత్రులు శ్రీ విట్టుబాబు గారికి ఆదరాభివాదాలు. సాదర ధన్యవాదాలు.

మఱి.. మీకున్నూ......బోలెడు! జోలెడు! చదివితేనే!!

రాజమహేంద్రవరము — మీ

19.03.2026 — కవితా ప్రసాద్

విషయసూచిక

1.
అహోపుఋషిక



కుటుంబ
హర్మ్యానికి
అనాదిగా
అలాగే
పునాదిగా
కాలు చేతులే
స్తంభాలుగా
అవధి లేని
హృదయాకాశమే
కప్పుగా..
పురుషుడా
నువ్వంతేగా.. ♦

2
అదంతే!

ఆక్రోశించి ఆక్రోశించగా
కర్మ కాలి
ఎప్పుడైనా ఓ సారి దర్శనమిస్తే
స్వామీ రండి !
సుఖాసీనులు కండి!
అంటూ వంగి పెడతాం కోటి
దండాలు!
అదే రోజూ కన్పిస్తే
"ఏరా వచ్చావా! కూర్చోరా !"
అంటాం! స్థూలైనా చూపించం!
అతి పరిచయా దవజ్ఞా!
ఆ విషయం దేవుడనేవాడికి
బాగానే తెలుసు!
గీతా జ్ఞాని ఆమాత్రం ఎఱుగడా?!
అందుకే అంతటా ఉంటాడు కానీ
అరిచి గీ పెట్టినా అగుపించనే
అగుపడడు!
పరోక్షమో అపరోక్షమో
అనుభూతే కాని అనుభవానికి
దొరకని మహానుభావుడు! ♦

3
అభావం

నిన్న నేడు రేపు
ఉదయం మధ్యాహ్నం సాయంత్రం
ప్రసంగాలతో సత్కారాలతో
ప్రవాచకుడు బిజీ బిజీ!
ఊపిరి తీసికొనేందుకే
వీలు చిక్కటం లేదు!
శ్రోతకూ వీలు కుదరటంలేదు
చెవికెక్కించుకోటానికి!
బిజీ బిజీగా సెల్ ఫోను చెవులతో
ఆది మధ్యాంతరంలోనే
అర్థంటు నిష్క్రమణం!
ఇక అనుష్ఠానం గురించి చెప్పాలా!
ఇద్దరూ పాపం!
సమయాభావ బాధితులే!
మాటలన్నీ గాలిలోనే!
అందులోంచి మళ్ళీ
దూరశ్రవణంలోకో దర్శనం లోకో
యూ గొట్టం లోకో! ఆడియో లోకో
వీడియో లోకో దూరి విడిది
చేస్తాయంతే!
భావం కుదిరేదెప్పటికి?
భావాభావం దొరికేదెప్పటికి?
ఆశా భావమో! ఆశాభావమో!

♦

4
ఆనందో బ్రహ్మ



ఈ హాసం
వికసించిన నీలోత్పలం!
ఇది వెల్లివిరిసిన నిష్కల్మషం!
సుపక్వ దాడిమీబీజ రదనచ్ఛదాల మధ్య
ఉదయించిన నిరతిశయ సచ్చిదానందం!
పెల్లుబికిన అమృతానందాస్వాదనం!
పరమహంసల దహరాకాశ దీపం!
పెంజీకటి కవ్వలి వెలుఁగు కిరణం!
వర్ణాలన్నీ కలసిన వర్ణనాతీత వర్ణం!
ఇది ఆనందో బ్రహ్మ!
ఇది అహం బ్రహ్మాస్మి!

♦

5
ఆమరణాంతం

జీవిత గ్రంథంలో
నిన్నటి మొన్నటి పుటలను
చించేయకు!
నలుపైనా! తెలుపైనా!
నేటి రేపటి పుటలు
వాటికి కొనసాగింపే!

చివరిది స్వర్ణ వర్ణాత్మకం కావాలంటే
అన్నిటి దన్నూ ఉండాలి!
ఒక్క మాటతో వాక్యం కాదు
ఒక్క స్వరంతో రాగం కాదు
ఒక్క పుటతో గ్రంథం కాదు!

♦

6
ఆర్నెల్ల ఆపసోపాలు

అమర లోకంలో
కొడుకు యముణ్ణి చూట్టానికి
తండ్రి సూర్యుడు పోయేదే
దక్షిణాయనం
తిరిగి సొంత గూటికి
మరలిపోయేదే
ఉత్తరాయణం

అమెరికా లోకంలో
సంతును చూడ్డానికి
కన్నవాళ్ళు పోయేదే
పశ్చిమాయనం
మరల సొంత కొంపకు
ఉస్సురంటూ ఏతెంచేదే
పూర్వాయణం
ఆయన ప్రయాణం ఆర్నెల్లు!
వీళ్ళ ప్రవాసం ఆర్నెల్లు!

♦

7
ఇంటిగోల

ఇల్లేమో పిడికెడంత!
అంతోటి దానికేమో
నాల్గు ద్వారాలు!
మూసుకున్నంత సేపు పట్టదు
తెరుచుకోవటానికి!
కాస్తో కూస్తో

సత్యాన్ని సంతరించి
లోపల దాద్దామంటే
వీలే కావటంలేదు!
నిరాశ్రయాయా! నీరూపా!
నేనేం చేయను మఱి!

♦

8
ఉపాధి హామీ

ఉపాధి హామీ పథకం
ప్రభుత్వం వారిది
ఏడాదిలో సగమో! పావో!
ఉపాధి హామీ పథకం
భగవంతుడిది
అనవరతం!
జన్మ జన్మలకీ!
వద్దనుకొని
వేరే త్రోవలో పోవటం
నీ చేతుల్లోనే ఉంది!
ఏదైనా!

♦

9.
ఉర్వారుక మివబంధనాత్

భార్య శివానితో కాశికి వచ్చి
ఆరేళ్ళుగా అఘోరిస్తున్నానిక్కడే!
అద్దె తక్కువని ఇక్కడ ఇల్లు తీసుకొన్నాను
జాహ్నవికి దూరమే కాని
అన్న సత్రాలకు దగ్గరే!
ఏకమేవాద్వితీయం!
కుదిరితే వెళ్ళి మున్గి వస్తున్నాను
లేదంటే గీజరులోనూ ఆ తోయమేగా!
సర్వవ్యాపినే నమః!
రోజూ ఏం పోతాంలే అని
మనసులోనే తల్చుకొంటున్నాను!
ద్వైతరహితాయనమః !
ధర్మపత్నిని శివా శివా అని పిలుస్తూంటే

అజామిళ మార్గంలో టు ఇన్ వన్ గా
విశాలాక్షీ విశ్వేశ్వరుల నామపారాయణం
ఆటో మాటిక్ గా జరిగిపోతోంది
నిర్మమ! ఇంటర్నెట్ పుణ్యమా అని
బాంకుల ఆస్తిపాస్తుల వ్యవహారాలన్నీ
ఇక్కడినుంచే ఇబ్బంది లేకుండా చక్కపెట్టేస్తున్నాను.
కాశీలో ఉండటం ఖర్చు కలిసొచ్చింది
నిర్మోహం! దూరభారం అంటూ
శుభాశుభాలు వేటికీ వెళ్ళటం లేదు!
ఏసి గదిలోనే ఏకాగ్రతగా
టీవీ ఛానెల్సు చూస్తూ
బయటి ప్రపంచంతో మమైక్యమౌతున్నాను.
సాధారణంగా సత్రం భోజనంతో సరిపెట్టుకొంటూ
అప్పుడప్పుడూ ఇంట్లోనూ!
కాకర కాయను, కరివేప పండునూ
దురద కందనూ వదిలేసాను!
అన్నింటితో ఏదో ఇలా అంటీముట్టనట్టుంటున్నాను!
“ఏమండోయ్! మా అన్నయ్య వదినా వస్తున్నారట!”
ధర్మపత్ని వార్తా ప్రసారం!
“అలాగా శివా! దోసకాయలిక్కడ దొరికేదవ్వగా!
ఓ రొండు కిలోలు తెమ్మను వచ్చేటప్పుడు శివా!”
ఫర్మాయించేసాను!
ఆ శివయ్య ఎప్పుడు చెవి కొరుకుతాడో ఏమో!
ఈలోగానే దోసావకాయ, బొబ్బట్లు చేయించుకొని
తినేయాలని మనసులోనే తీర్మానించుకొన్నాను! ♦

10
ఎ(బొ)దుగుదల

నాడు.. వాడు..
పట్టి పట్టి ప్రయత్నిస్తూ
నే నేర్పిన మాటలు అంటుంటే
బంగారు శకలాలు!
సంభ్రమం ... సంబరం...!

నేడు... వాడు...
సొంతంగా పలుకుతున్న
“వాడి” మాటలు వింటుంటే
జాంగుల శలాకలు!
విభ్రమం...విచారం ....! ♦

11
ఐతరేయం

ప్రజ్ఞానం బ్రహ్మ మైతే
అజ్ఞానమూ బ్రహ్మమే!
అ అంటే అంబ పార్వతి
అ అంటే త్రిమూర్తులు
అ అంటే ఇంద్రాగ్నివాయువులు
అ అంటే సూర్యచంద్రులు
అ అంటే కాలం, ప్రణవం, యజ్ఞం

అ అంటే నారాయణుడు
అందుకే
అజ్ఞానము బ్రహ్మమే!
ప్రజ్ఞానమూ బ్రహ్మమే!
ద్వంద్వమూ బ్రహ్మమే!
ద్వంద్వరహితమూ బ్రహ్మమే!
అద్వైతికి కూడా అంతే! ♦

12
ఓం శాంతిః

ఈ ఉగాదికి
ఏ కవి సమ్మేళనంలోనూ
పాలు పంచుకోలేదు
నేను!
అహింసా పరమో ధర్మః
అని!

(విశ్వావసు ఉగాది) ♦

13

ఒక్కొక్కప్పుడు

అప్పుడప్పుడూ
గతించిన కాలంలోకి వెనక్కి వెళ్ళాలనుకొంటాను!
జరిగిపోయిన ఘటనలను ఏదో మార్చేద్దామని కాదు
ఒకటి రెంటిని మరలా అనుభూతి చెందాలని!
అప్పుడప్పుడూ
కొద్దిసేపు పసిపాపగా మారిపోవాలనుకొంటాను!
తోపుడు బండితో నడవాలని కాదు
అమ్మ పెదవుల చిరునగవును
మరలా ఓమారు ఆలోకిద్దామని!
అప్పుడప్పుడూ
మళ్ళీ బడిరోజుల్లోకి పోవాలనుకొంటాను!
తిరిగి పిల్లాడిగా మారిపోవాలని కాదు!
కనుమరుగైన నాటి స్నేహితులతో
మఱికొంత సేపింకా గడపవచ్చని!
అప్పుడప్పుడూ
కళాశాల దినాలకు మళ్ళాలనుకొంటాను
విశృంఖలంగా తిరగవచ్చని కాదు
పాఠాలను నిజంగా అర్థం చేసుకొందామని!
అప్పుడప్పుడూ
తొలి ఉద్యోగపు రోజులకు పోవాలనుకొంటాను!
పని బరువు తక్కువ ఉంటుందని కాదు
ఆ తొలుదొల్తటి సంపాదనోత్సాహపుటుబ్బును ఆస్వాదిద్దామని!
అప్పుడప్పుడూ
ఈ మా పిల్లలు చిన్నవాళ్ళుగా మారిపోతే బాగుండునే అనుకొంటాను!
వాళ్ళేదో తొందర తొందరగా ఎదిగిపోయారని కాదు
వాళ్ళతో ఇంకొంచెం ఆడుకోవచ్చు గదాని!

అప్పుడప్పుడూ
నేను మరిన్ని దినాలు బ్రతికితే బాగుండుననిపిస్తుంది!
బోలెడంత కాలమేదో బ్రతకిపోవాలని కాదు!
సమాజానికి నేనేమైనా సాయపడటం కుదురుతుందేమోనని!
అనాదిగా
గతించినదేదీ తిరిగి వచ్చే వీలే కన్పట్టలేదు!
అందుకే బ్రతికుండగానే ఈ క్షణాలను
ఆనందంగా అనుభవించేద్దాం!
ఈ క్షణం నుండే, సంపూర్ణంగా!
(Robert Drake "SOME TIMES" కు స్వేచ్ఛానువాదము) ♦

14
ఔను..వెనుకబడ్డాడు!

భవిష్యత్ కీర్తి పథాన
రఘురాముడు రథం మీద పోతుంటే
దశరథుడు వెనుకబడ్డాడు!
పురుటి పట్టిని జగద్గురువు కావాలని
పరాయి పంచన చేర్చి
వసుదేవుడు వెనుకబడ్డాడు!
ఆనందమయ జీవితాన్ని పొందాలని
మూల మూలలకు ఎగిరిపోవటానికి
తన రెక్కలు పిల్లల కిచ్చి
మిగిలిన కాళ్ళు ముడుచుకొని
వెనుకబడుతూనే ఉన్నాడు నేటి నాన్న!
అసలు బిడ్డ తొలి పలుకుగా అమ్మ అన్నప్పుడే
వెనుకబడిపోయాడు అమాయకపు నాన్న! ♦

15
ఓల్డ్ ఈజ్ బోల్డ్ ఎండ్ బ్యూటిఫుల్
(ప్రపంచ వృద్ధుల దినోత్సవం Oct 1)



వృద్ధుణ్ణి నేను! బుద్ధుణ్ణి నేను!
విబుధుణ్ణి నేను! నిబద్ధుణ్ణి నేను!
కాలాశ్వపు కళ్ళెం పట్టి
స్వారీ చేసిన ఆశ్వికుణ్ణి నేను!
మానావమానాలను సుఖశోకాలను
ప్రమాద ప్రమోదాలను భరించి
కష్టాల భవ సాగరాన్ని
ఈది తరించిన వాణ్ణి నేను!
కాలానుగుణంగా మెలగిన కర్మిష్ఠుణ్ణి
నేను!
మమకారాలకు బందీయైన
వయసు మళ్ళిన బొందిని నేను!
రెండు తరాలకు సంధిని నేను!
మొండైన మోడును కాను నేను!
వన్నె తగ్గినా విలువ తగ్గని పసిడి నేను!
కాలపుటానవాళ్ళ స్మృతిని నేను!
ఎక్స్పైరీ లేని ఓల్డ్ ఫ్రెంచి వైన్ నేను!
అనుభవాల రత్ననిధిని నేను!
వివర్ణ కేశుణ్ణైనా
అనిర్విణ్ణ ధీశుణ్ణి నేను!
వద్దు వద్దనుకొన్నా తరతరాలలో
మిగిలిపోయే డీ ఎన్ ఏ ను నేను! ♦

16
కల్యాణం మహనీయం

కల్యాణం
కలసిన మనసులకు
కమనీయం
కలవని మనసులకు
దయనీయం
ఏదైనా
మమైక్యమనే
పాణిగ్రహణ వ్యవస్థ
మహనీయం
మోహ సహజీవనం
దమనీయం
ఎల్ల కాలానికి నిలిచిన
సంప్రదాయం కల్యాణం
కాలదన్ని చేస్తే
చివరికి మిగిలేది
తరగని శూన్యం
ఎంత వగచినా
తొలగని దైన్యం
దొరకదు నీ కన్నీటిని
తుడిచేందుకో హస్తం! ♦

17
కవితా! ఓ కవితా!

కవితా నా యింటి పేరు
కవితా నా వంటి పేరు
కవిత నా రక్తం
కవిత నా సూక్తం
కవిత నా రక్తి
కవిత నాకు భక్తి
కవిత నా కల కువ
కవిత నా మెలకువ
కవితకు ప్రతి రోజూ
పుట్టే దినమే
కవులకు ప్రతి రోజూ
సంతోష దినమే
కనిపించిన దాని వెనుక
కనిపించనిదీ
వినిపించిన దాని వెనుక
వినిపించనిదీ
కలంపోటుతో
నోటి మాటతో
వెల్లడించి
తల్లడిల్లకుండా
తలాడించేలా చేసేవాడే
కవి, కవులలో రవి!
కవిం నమామి!
కవితాం స్మరామి !

(ప్రపంచ కవితా దినోత్సవం) ♦

18
కాల వ్యాకరణం

భార్యాభర్తలు
సిద్ధ సమాసం
వధూవరులు
సిద్ధసమాసమే
విధి వ్యాకరణం తెలియక
'నిధి' వ్యాకరణంతో
సాధ్య సమాసంగా
కూర్చుదామని వెట్టి ప్రయత్నాలు!
జాతకాల తతంగాలు
ముహూర్తాల బలాబలాలు!
అమ్మయ్య! జోడించామని సంబరాలు!
మాంగల్యం తంతునానేన..
కతిపయ కాలానికి
ఆ! మన చేతుల్లో ఏముంది!
అలా రాసిపెట్టుంది మఱి!
పెళ్ళిళ్ళు స్వర్గంలోనే
జరిగిపోతాయట!
అంతా దైవ ఘటన!
మనం నిమిత్తమాత్రులం!
వ్యాకుల చిత్తాలకు
"కాల" వ్యాకరణ జ్ఞానోదయం!

♦

19
కిమౌషధమ్

వయసు మీరేసరికి
లివర్ వ్యాకోచించింది
ప్రోస్ట్రేట్ వ్యాకోచించింది
లంగ్స్ వ్యాకోచించాయి
స్ప్లీన్, బ్లాడర్, కిడ్నీలు
... .. వ్యాకోచించాయి
గుండే వ్యాకోచించింది
అదేంటో హృదయం మాత్రం
వ్యాకోచించింది లేదు....పైగా
వయసుతో పాటు సంకోచిస్తోంది!
ప్రవచనౌషధాలేమీ
పనిచేయటంలేదు!
బాహ్యదృష్టితో పాటు
లోదృష్టీ సంకోచిస్తోంది!
వైకుంఠ ధన్వంతరీ!
ఈ మందునికి
ఏదో మందివ్వు స్వామీ!

♦

20
కుంభ సంరంభం

మది కారవేల్లం
మతి వేపి వాలం
త్రివేణిలో జలకం
ఎక్కడుందో ఉచిత భోజనం?
కుంభమేలాలో మాలలమ్మే కుట్టది!
జంభారి లోక రంభలా ఉందే!
శేష త్రయం అఖాడాల్లో
ఉన్నారేమో?
తిక్త ముక్తమూ కాలేదు
ఆవు తోకా కాలేదు
అదేమిటీ ..దూరంగా.. అక్కడ?
త్రివేణిలో పైకి లేచిన చేప
హంస లాంటి కొంగనోట్లో
విముక్తి పొందుతోంది!
మునిగి లేచిన వీడికీ
ఏదో నాడు విధి నోట్లోనే!
యోజనాల దూరం నుంచి రాక!
ప్రయోజనం లేని మునక!
వియోజనం లేదే మనసు కింకా!

♦

21
కొలమానం

రేణువంత ఇష్టాన్నిస్తావు
కొండంత కష్టాన్ని కలిగిస్తావు
అణువంత సుఖాన్నిచ్చినట్లుంటావు
అపారమైన దుఃఖంలో ముంచుతావు
రవంత శాంతి నిస్తున్నట్లే ఉంటావు
అనవధిక అశాంతి పాలపడేస్తావు!
పరమాణువంత సూక్ష్మం
బ్రహ్మాండమంత స్థూలం
పరమాత్మా!
నీకు తెలిసిన మానాలు ఆ రెండేనా?
అంతేలే!
వామనత్వం! విరాడ్రూపం!
ఈ రెండేగా నీకు తెలిసినవి!
ఏదో నీ భక్తుడిగా చెప్తున్నా!
నీ అనాది రేషన్ కొలతలను
ఇకనుంచైనా సవరించి
అటుదిటు ఇటుదటు చెయ్యి!
లేకుంటే నీ ప్రభుత ప్రమాదంలో
పడుతుంది సుమీ!

♦

22
కెవ్వింపు



తొమ్మిది నెలల చీకటి గుహనుండి
విముక్తి దొరికింది ఎట్టకేలకు!
రెప్పలు విడుద్దామనుకొంటే
ఏదో భయం!
ఒక్క సారి కన్ను తెరిస్తే
మళ్ళీ కనుమూసేవరకూ
ఈ క్రొత్త బ్రతుకెలా ఈడ్చాల్సి వస్తుందో అని!
ఎవరో అంటున్నారు గాబరాగా!
"ఇదేమిటి అసలు ఏడవటమే లేదు!"
డాక్టరు గాబోలు వచ్చి గిల్లాడు
బాధతో కెవ్వుమన్నాను!
మొదటి కన్నీటి బొట్టు రాలింది!
అందరూ ఆనందో బ్రహ్మ!
కన్నవాళ్ళతో సహా!
లోకం శోకరతంచ సమస్తం!
డాక్టరు కన్నా సెన్సు ఉండక్కర్లే?
గిల్లి గిల్లి కెవ్వించకపోతే
గిలిగిలి పెట్టి నవ్వించొచ్చు కదా!
తర్వాత్తర్వాతెలా ఏడ్చినా కనీసం
జీవిత ప్రారంభమైనా నవ్వుతూ చేసేవాణ్ణి! ♦

23
ఉగాది పంచాంగశ్రవణం

ఉగాది శుభాకాంక్షలు
పంచాంగం విప్పుతున్నా వినండి
దేశంలో మూడవవంతు ప్రజలకు
చైత్ర వైశాఖాలలో ధనలాభం
రెండు లేదా మూడు చోట్లనుంచి!
మండు వేసవి ఐనా
మధురసుధలు బాగానే దొరుకుతాయి
వసంతం వెళ్ళేవరకు!
కోలాటాలు బాగా జరుగుతాయి!
కర్రలతో తలల మీద!
కత్తులతో కుత్తుకలమీద!
మీరెన్నుకొన్న అభ్యర్థులు
అధికారంలో కాని ప్రతిపక్షంలో కాని
లేదా ఇంట్లో కాని ఉంటారు!
కొండొకచో జైలులో కూడా!

ఎగువ తరగతి దిగువ తరగతి
గతంలో లానే ఉంటారు!
మధ్య తరగతి మామూలుగానే
మథ్యపడుతూ ఉంటారు!
గ్రహగతులు గాడితప్పవు
జనాల బ్రతుకులు గాడిన పడవు
అభివృద్ధికి కొదవుండదు
ప్రభుత్వ వాగ్దానాలలో
ధరల పెరుగుదలలో
నైతిక విలువల తగ్గుబడిలో!
ఆలయాలన్నీ కిటకిటలాడుతూనే ఉంటాయి
దేవుళ్ళను దేవుళ్ళాడుతూ!
మళ్ళీ ఉగాది వచ్చే దాకా ఇలానే!
ఆ తర్వాతా అలానే!
శుభం భూయాత్! స్వస్తి! ♦

24
గమ్యం

నిన్ను వదిలేస్తే
ఏకాకిత్వం
నువ్వే వదిలేస్తే
ఏకాంతం
అది మమకారపు బాధ
ఇది ఆత్మ శోధనపు బాట

నిశ్శబ్దాన్ని విను
శూన్యాన్ని కను
మర్చిపో మనికిని
ఉదల్చుకో ఉనికిని
మాయ మనస్సును
కానీ మాయం

తెరిచిన కంటికి
మోహాకాశం
వెలిగే చీకటి
మూసిన కంటికి
దహరాకాశం
చీకటే వెలుగు! ♦

25
చర్విత చర్వణం

విధాతృ డోనాడు నన్ను సృష్టించాడు!
నా జీవిత వ్యాపారాన్ని "విధి" స్టాక్ ఎక్ఛేంజిలో లిస్టింగ్ చేసేసి
సి ఇ ఓ పీఠం తన పితృహస్తగతం చేసి
చేతులు దులిపేసుకొన్నాడు!
ఆయన తన ఆజ్ఞాపాలకులు డైరక్టర్లుగా
సర్వం తానే ఐ నిర్వహించేవాడు!
అడక్కుండానే అన్నీ నోటి దగ్గరికే వచ్చేవి!
తింటం ఆడుకోవటం పడుకోవటమే నాకు పని!
అందరూ అడుగులకు మడుగులొత్తుతూ
కాలు క్రింద పెట్టకుండా గుండెల మీద పెట్టుకొంటూ
నేనేం చేసినా జై జై కొట్టేవాళ్ళు!
నా జీవిత వ్యాపారం షేర్ విలువ
ఇంటర్నేషనల్ లెవెల్లో 'బెర్క్ షైర్ హాథవే' లాగా
నేషనల్ లెవెల్లో 'ఎమ్మారెఫ్ టైర్స్' లాగా
ఓ రేంజ్ లో ఉండేది!
ఇంతలో మెల్లమెల్లగా పంచేంద్రియాలు పన్చేయటం మొదలైంది!
"నేను" నేనని నాకు తెలియజెప్పటం మొదలెట్టాయి!
హరి నా వ్యాపారాన్ని నాకు ఒప్పగించేసాడు!
"ఇకపై నీ బ్రతుకు వ్యాపారం నడుపుకోవటం నీ ఇష్టం!
కేవలం "పై" నుంచి చూస్తూంటానంతే" అన్నాడు!
నరనరాల్లో ఉత్సాహం పెల్లుబికింది!
వ్యాపారాన్ని ఇంకా వృద్ధి చేయాలని ఆకాంక్ష పెరిగింది!
'ఆశ' తో పెళ్ళైంది!
నెమ్మది నెమ్మదిగా ఆర్గురు బామ్మర్దులు

షేర్ హోల్డర్లుగా చేరారు! డైరక్టర్లయ్యారు!
వ్యాపార నియంత్రణ అలా
హరివర్గం నుంచి అరివర్గానికి మళ్ళింది!
పెత్తనం పెరిగింది! అపమార్గం పట్టింది!
నా నిర్ణయాలన్నీ వాళ్ళ నిర్దేశితమే!
వాళ్ళెలా అంటే అలా నడిచింది!
ఆశయా బధ్యతే లోకే!
వాళ్ళ కబంధ హస్తాలతో వ్యాపారం కబళించబడింది!
డెబ్భై ఏళ్ళకి ఇప్పుడు చూసుకొంటే
బ్రతుకు వ్యాపారం ఛిన్నభిన్నమైపోయింది!
కుప్పలు తెప్పలుగా తప్పులు దొర్లిపోయాయి!
షేరు వాల్యూ జీరో ఐపోయింది!
ఇంక ఈ వ్యాపార వ్యవహారం "నా" వల్లకాదని
తెలిసొచ్చింది! తెలివొచ్చింది!
హరీ! హరీ! ఆపద్బాంధవా!
నన్నీ కశ్మలం నుంచి బయట పడేయ్ అని ఎలుగెత్తి వేడాను!
"ఓ! ఈ జన్మలోనూ ఇలాగే చేసుకొన్నావా! ప్చ్!"
"అంతా ఐపోయింతర్వాత నన్ను తల్చుకొంటే ఏం లాభం?'
"హరుడికి IP అప్లికేషన్ పెట్టు
Liquidation బాధ్యతలాయనవే" అని విలాసంగా నవ్వాడాయన!
ఛెళ్ళున చెంపలేసుకొని శ్రీహరి చెప్పినట్లే చేసా!
చివరి ప్రక్రియను ఆ హరుడెప్పుడు పూర్తిచేస్తాడా అని
ప్రతి క్షణం ఎదురుచూస్తూ గడుపుతున్నా!
శివ శివా! శివ శివా! అంటూ! ♦

26 చిత్తశుద్ధి

ప్రవాచకోవాచ!
నకారాత్మక భావాలను త్రుంచుకోండి!
పునరువాచ!
సకారాత్మక దృక్పథాన్ని ఎంచుకోండి!
తలపంకించి ఉపక్రమించాను!
అసత్తు! అధర్మం! అధైర్యం! అనాచారం!
అశ్లీలం! అశ్రద్ధ! అలక్ష్మి! అలక్ష్యం! అశాంతి ....!
బయటకు రండి రండని ఒక్కొక్కదానినీ
పట్టుకొని శిరఃఖండనం చేసి వెనక్కి పంపేసాను!
అ ఖండనంతో అన్నీ అందంగా మారిపోయాయి!
బాగు బాగు బహు బాగు అని ఆనందపడుతుంటే
మరికొన్ని బయటకు వచ్చి గుమిగూడాయి!
అద్వైతం! అనశ్వరం! అదృష్టం! అక్షరం! అభవం!
అమోఘం! అవ్యయం! అచలం! అక్రూరం! అభయం.....!
మా గతి కూడా ఇంతేనా?
అంటూ దీనముఖాలయ్యాయి!
అవి దుర్మతులు!
వెట్టి తలలెగరేసాయి!
వాటి అకారాలు వికారాలు!
మీరు సుమతులు!
తలవంచిన బుద్ధిమంతులు!
మీ అకారాలు ఆనందకరాలు!
అందుకని మీకు అ ఖండనం లేదు!
బుజ్జగించి వెన్ను నిమిరాను!
నన్నాశ్రయించుకొని ఎప్పట్లాగే
అఖండంగానే అఘోరించండని
ప్రేమగా నా లోలోపలికి నెట్టేసా!

♦

27
ఛాయా క్రీడ

నీడ నాదే!
నేను లేకుంటే దానికి ఉనికే లేదు!
ఐనా దాని మీద నా అజ్మాయిషీ చెల్లదు!
ఎవడో ఆకాశ రామన్న!
వాడు చెప్పినట్లు నడుస్తుంది!
తోడుగా జోడుగానే ఉన్నట్లుంటుంది!
కానీ...
పొద్దు పొద్దు కో బుద్ధి!
ఓ సారి నా కంటే చిన్నగా
ఒదిగుంటుంది!
ఓ సారి నా కంటే మిన్నగా
విఱ్ఱవీగుతుంది!
ఓ సారి నా సన్నిభంగా
సంచరిస్తుంది!
ఒక్కో సారి ఎదురుగ్గా నడుస్తుంది!
ఒక్కో సారి వెనగ్గా వస్తుంది!
ఒక్కో సారి ప్రక్క పోకడలు పోతుంది!
అలా నేను బయటికొస్తే చాలు
ఎన్ని వెఱ్ఱి వేషాలేస్తుందో!
దాని తిక్క కుదర్చాలని
నేను ఇంట్లోకి జారుకొంటాను!
అంతటితో దాని ఆట కట్టు!
ఇక్కడ చూస్తే ఇంట్లో వీళ్ళూ
నా నీడ లాంటి వాళ్ళే!
వీళ్ళవీ ఆ పోకళ్ళే!
వీళ్ళ ఆట కట్టించాలంటే మఱి?
ఆఁ! అదొక్కటే దారి!
నేనే పైవాడి నీడలోకి చేరిపోతే సరి! ♦

28
తత్ సత్

సగుణ పరమాత్మ
ఆస్తికుడు!
నిర్గుణ పరబ్రహ్మ
నాస్తికుడు!
కనిపించీ కనిపించనిదొకటి!
కనుపించకుండా
కనుపించేదొకటి!
మిథ్యే తథ్యం
తథ్యమే మిథ్య!
అద్వైతంలో
రెండూ ఒకటే!
అద్వైతికి ఇద్దరూ
ఒక్కటే!
ప్రజ్ఞానం బ్రహ్మ! ♦

29
ఛాయాజాలం

ఉదయపు నీరెండలో నడుస్తుంటే
నా నీడ నన్ను చూసి
వెవ్వెవ్వె అంది!
"చూడు నేనెంత పొడగరినో!
నువ్వు వామనుడివి!
నేను త్రివిక్రముణ్ణి!"
మనసు కుతకుత ఉడికిపోయింది
అవును! అనువు కాని సమయం!
అనుకొంటూ
తమాయించుకొన్నాను!

* * *

హమ్మయ్య! సూర్యుడు
నడినెత్తికొచ్చాడు!
వడివడిగా ఇంట్లోంచి బయటకు
అడుగుపెట్టాను
నా కాళ్ళకింద బెత్తెడై
కుంచించుక పోయిన నీడను
కసికసిగా తొక్కాను!
హహ్హహ్హ! ఇప్పుడేమంటావంటూ
పరిహసించి ప్రశ్నించాను!
"నాకు బుద్ధి గరపటం కోసం
నువ్విలా
మండుటెండలో మాడిపోతుంటే
బాధగా ఉంది!
కాళ్ళు చూడు ఎలా
కాలుతున్నాయో!
చాలు ఇంక! ఇంట్లోకి పద!"
కాళ్ళు పట్టుకొని వే(ళ్ళా)డసాగింది!
నివ్వెరపోయాను!
నా నీడకు నాపై ఉన్న ప్రేమకు
నా మనసు ఆర్ద్రమైపోయింది!
కళ్ళు చెమర్చాయి!
ఔను! ఎంతైనా అది నా నీడ!
నేను వామనుణ్ణైతే అది త్రివిక్రముడు
నేను త్రివిక్రముణ్ణైతే అది వామనుడు
విడివడి మనలేని వారం కదా!
వెంటనే ఇంట్లోకి దూరాను!
నాతోడై నా నీడానూ! ♦

30
జీవన గానం

ఊపిరి పోసుకుంటూనే!
ఉగ్గుపాలింకా త్రాగకుండానే!
జీవన గానం మొదలు పెట్టేసాను
అనభ్యసనంగానే ఆరున్నొక్క రాగంలో!
ఎవరున్నా విన్నా లేకున్నా !
అమ్మొంటుందిగా! వింటుందిగా!
శిశుర్వేత్తి ..వేత్తి గానరసం మాతః!

రాగం ఒకటే ఐనా
అవసరాన్ని బట్టి ప్రస్తారం!
ఆకలి, అజీర్ణం, నిద్ర, అశాంతి,
పీడకలలు,
దోమల పీడ, కొత్తచంకెక్కుడులు...
ఏదైనా, సాహిత్యం లేకుండానే అర్థం
ఐపోయేది!
అమ్మ కంటే విద్వచ్ఛ్రోత్రి ఇంకెవరు!
పేగు తీగ తెగినా వైపై బంధం శాశ్వతం!

ఊహాపోహలు రాగానే
ఎంతకాలమీ కేవల రాగాలాపం అని
అలతి మాటలతో సాహిత్యాన్ని కూడా
జోడించటం మొదలుపెట్టాను!
స్వర స్థాయీ భేదాలను ప్రదర్శించాను!
పల్లవి పాడటం ముగిసి
మొదటి చరణం లోకి మారాను!
శ్రుతి లయలు స్వరస్థానాలు సుష్ఠుగా
ఉండేవి!

వినేవాళ్ళకు తక్కువలేదు!

కతిపయ కాలానికి రెండో చరణంలోకి
వచ్చాను!
గానం శ్రుతి తప్పటం మొదలైంది!
కొందరైనా వింటున్నట్లుండేవారు!
క్రమంగా మూడవ చరణం
ఆలపించసాగాను!
లయ కూడా తప్పటం మొదలైంది!
వినే వాళ్ళూ తగ్గిపోసాగారు!
కాలం గడుస్తూ గడుస్తూ..
చివరి చరణం లోకి వచ్చేసాను!
ఇప్పుడు స్వరాలూ తప్పుతున్నాయి!
వినిపించుకొనే వాళ్ళెవ్వరూ లేరు!
"నిర్జీవ నాదం ఇది!" అని తెలుస్తోంది!
ఇంక ఆపేయాల్సిన తరుణం"
అనిపిస్తోంది!
ఆపేస్తాను అతి త్వరలోనే, త్వరగానే!
ఆ తర్వాత ...?
ఏముందీ! మామూలే!
మళ్ళీ ఆరున్నొక్క రాగంతో మొదలే!
శ్రుతి లయలు స్వరాలు తప్పకుండా
చివరి చరణం తుది దాకా
ఎప్పటికి పాడగల్గుతానో
అప్పుడేగా ఈ గానానికి అంతం!
ప్రశాంతం! ♦

31
టెంక బాంగ్



నా పనైపోయిందనుకొన్నారా?
ఇక పనికిరాని దాన్ననుకొన్నారా?
పాతేసి చూడండి!
బిగ్ బాంగే!
మళ్ళీ లేస్తా
అణో రణీయాన్ మహతో మహీయాన్
వేల వేళ్ళతో వేల కొమ్మలతో
వేవేల రెమ్మలతో విరిపూలతో
విరాట్పురుషునిలా విస్తరిస్తా!
వేల కాయలై విరగ కాస్తా!
వేల పళ్ళనై వేల కడుపులు నింపుతా!
ఆమ్ర రసామృతం పంచే మోహిని నౌతా!

♦

32
తృతీయాశ్రమం

శీతల బ్రహ్మచర్యం
మండుటెండల గార్హస్థ్యం
ముగిసి
కాలపురుషుడు
చేస్తున్నాడిప్పుడు
"వాన" ప్రస్థం!

♦

33
నయనాభిరామం

డాక్టర్ సునయన
గట్టిగా నొక్కి చెప్పింది
మీ కళ్ళు పూర్తిగాఎండిపోయాయి
మొబైల్ వాడటం మానేయండని!
ఆ మాటలు చెవిన పడగానే
కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి గిర్రున!
ఎక్కణ్ణుంచొచ్చాయో మరి!

♦

34
తొలకరికి స్వాగతం

తొలకరి వాన పలకరింపు
నేల తల్లికి పులకరింపు
వరుణ దేవునికి మట్టి వాసన
ధూపమాఘ్రాపయామి!
లా నినో కు లక్ష వందనాలు!
ఇవి మేఘాల మెరుపులా!
కావు! అన్నదాత ఆశల మెరుపులు!
ఇవి పర్జన్య గర్జనలా!
కావు! వృషభ రాజుల ఆనంద రవాలు!
ఇవి వాన చినుకులులా!
కావు! హాలికుల కంటి ఆనంద బాష్పాలు!
ఓ ప్రకృతి మాతా!
వాయుగుండ విలయాలు
గాలివాన బీభత్సాలు
తుఫాను భయదోత్పాతాలు
నిగ్రహించి అనుగ్రహించు
రైతునూ దేశాన్నీ
సుభిక్షం చేసి రక్షించు!
ఓ అన్నపూర్ణమ్మా!
నీ నిడుపైన కేశసంపదలా
మా పైరులను పెరగనీ!
నీ ఒత్తైన మల్లెపూచెండులా
వరి కంకులను బలవనీ!
ధాన్యరాశులను పండనీ!
మకర సంక్రాంతికే కాదు
ప్రతి రోజూ పొంగలిని వండనీ!
అందరి జీవితాలలో ఆనందం పొంగనీ!

♦

35
నాతి చరామి..!

పెళ్ళికి ముందు
పది వంద సార్లు పరిశీలించు!
విడి పోవాలనుకొంటే
వంద వేయి సార్లు విచారించు!
అసలు
పెళ్ళాడాలనుకొనే ముందు
వేయి లక్ష సార్లు ఆలోచించు!
ఎందుకంటే
న భర్తు ర్న భార్యా
స్వాతంత్ర్య మర్హతః ♦

36

త్యాగేనైకే..

తేనె బొట్టు!
మధురాతి మధురం!
అమృతోపమానం!
పాపం! ఆ సుమబాల
మధుపంతో ఎన్ని సార్లు
కుట్టించుకొని బాధపడిందో!

పట్టు బట్ట!
అందానికి అందం!
ఆనందాంబరం!
ఎన్నెన్ని మూగజీవాల
ప్రాణ హరణ ఫలితమో!

అమ్మ పొట్ట!
రోజు రోజు కది పొంగు!
ఎదలో ఆనందపు పొంగు!
ఓ ప్రాణి పుట్టువు కై
ఎంత ఆరాట పోరాటమో!

చెట్టపట్టు!
ఎక్కడో ఎక్కడో పుట్టి
ఒకరి బ్రతుకులోకి మరొకరు మెట్టి
నేను నేను కలిసి మేమై
మనము మనము కలిసి మనమౌ
పాణిబంధ పరిరక్షణకై
ఎన్ని పణబంధాలో!
ఎన్ని పట్టువిడుపులో! ♦

37

వృక్షభారతం

మా పక్కింటి ఇరుకు పెరట్లో
శాఖోపశాఖలతో మామిడి మాను!
తియతియ్యని రసాలను
ఎన్నేళ్ళుగా ఎన్నెన్నిచ్చిందో!
ఎన్ని తిన్నారో? ఎన్ని అమ్ముకొన్నారో?
ఆ కొమ్మలపై ఎన్ని శుకరవాలో!
ఎన్ని కుహు కహూలో! ఎన్ని కా కా లో!
ముసలి ఇంటిని పడగొట్టేసారు!
ఎపార్ట్ మెంట్లు కట్టాలని!
పాదు కట్టి ముసలి మానుకూ మందు
పెట్టారు!
ఆకులు రాల్చేసి ఎండి మోడై నిలబడింది!
కురుక్షేత్ర రణరంగంలో అస్త్ర సన్యాసం
చేసి
నిశ్చేతనుడైన ద్రోణాచార్యునిలా!
చేతిలో రంపంతో నేల కూల్చి
తంతు ముగించాడు వడివడిగా!
వాడు! అభినవ ధృష్టద్యుమ్నుడు! ♦

38
త్వమేవ...

ఓ పరాత్పరా!
అత్యతిష్ఠ ద్దశాంగులానికే
నిన్ను విరాట్పురుషుడని
'అహమేవ' అని నువ్వంటే
'త్వమేవ' అని అందరూ
తందాన తాన అంటున్నారు!
నా అహం చూసావా?
అత్యతిష్ఠ చ్ఛతాంగులం!
నువ్వే పెరుగుతావో
నన్నే దించుతావో
త్వమేవాహమో
అహమేవ త్వమో
ఏదో ఒకటి చేసి
"అహమేవ" గా
నువ్వే నిల్చిపో!
సమర్థుడవని సనాతనా!
ఆ పని నీకే వదిలేస్తున్నా
ఆ శ్రమ "న మమ" !
నేను పడలేను బాబూ!
వృద్ధుడ నైపోయాను!
ఇప్పటి దాకా కా(లే)నిది
ఇంక నా వల్లేమవుతుంది! ♦

39
దీక్ష

అతనెప్పుడూ ఎందుకలా ఉంటాడు?
ఎలా ఉంటాడు?
ఏదో పోగొట్టుకొన్నట్లు?
పద వెళ్ళి అతన్నే అడుగుదాం!
అడిగేసాం
విన్న అతను మా వంక చూసాడు!
పోగొట్టుకోవటానికి నా దగ్గరేముంది?
అసలు... నాదనేదేముంది?
మఱి ఎందుకిలా?
అన్వేషణ! అన్వేషిస్తున్నాను!
దేన్ని?
దేన్ని అన్వేషించాలో దాన్ని!
అన్వేషణకు మూలం ఎమిటి?
అదే! మూలాన్వేషణే!
ఎప్పటి వరకిలా?
ఎఱుకయ్యే వరకూ!
తర్వాతైనా లోకంలో పడ్తావా?
అప్పుడిక లోకంతో పనేముంటుంది?
అంతా అలౌకికమే!
అన్వేషణకు అంతం!
సాధనకు ప్రారంభం!
మూలంలోకి ముడుచుకుపోవటానికి!♦

40
దర్శనం

నా ముఖానికి
రెండు కుంభ కటకాలను అమర్చి
నాసాగ్రం నుంచి నభఃస్థలం దాకా
దృష్టించగలిగే అద్భుత దర్శినీ
యంత్రంగా
మలిచి సృష్టించాడు పరమాత్మ!
జీవికి పరమార్థమైన రెండక్షరాలను,
జీవుని తన్ను చేర్చే దారిని,
వెతుక్కోమన్నాడు!
పుట్టినదాదిగా అదే పనిలో పడ్డాను!
ఆఁ! దొరికాయి!
దొరికేసా..యన్నాను!
ధర్మం, అర్థం, కామం...
నేతి .. నేతి ...నేతి.. అంటూ ప్రతి
సారి కాదన్నాడు!
మళ్ళీ వెతుకులాటలో పడ్డాను
వెతుక్కొంటూ వెతుక్కొంటూనే
మధ్య వయసులోకి ఎగబ్రాకాను!
పూజ! యజ్ఞం! యాగం! తీర్థం!..
ప్చ్! నేతి..నేతి.. ఇవీ కాదన్నాడు!
మళ్ళీ వెతికే పనిలో పడ్డాను!
మలి వయసులోకి జారాను!
ఇక ఇలా పని కాదనుకొని

కటకాల దిశను
బాహ్యం నుండి అంతరానికి త్రిప్పాను
మనః ప్రపంచంలో మరో ప్రపంచం !!
శోధించాను శోధించాను
శోధించాను!
దొరికింది! దొరికింది! ఆఁ! ఇదే! ఇదే!
"దయ" అని నిశ్చయంగా అన్నాను!

పరమాత్ముని చిరునవ్వు వినిపించింది!
"ఔను! అదే! భూత దయే!

సకలభూతాత్ముడనైన నన్ను పొందే
పరమ మార్గం! పరమార్గం!

ప్రసన్నుడ నైనాను! ఏం కావాలో
కోరుకో" అన్నాడు
"మరింకేం కావాలి స్వామీ!
ఆ నితాంతాపార భూతదయనే
దయచేయించు" చేతులు జోడించాను
"భాగవతుడి వయ్యావు! తథాస్తు!
ఇక నువ్వూ నేనూ ఒకటే!"
పరమాత్మ ప్రకాశం నన్ను
ఆవేశించిందనిపించింది! ♦

41
దాగుడు మోతలు

ఫేస్ బుక్ డిపి ఫొటోలు
లింగమార్పిడి ఆపరేషన్లు!
చిక్కనీయని అడియాలాలు!
అసలుకే మోసం తెచ్చే
అతి తెలివి తే(తీ)టలు!

వాట్సాప్ డిపి ఫొటోలు
కుంచించుకపోయే వయసులు
జారిపోయిన యౌవనాలకు
కట్టిన సమాధి బాక్సులు!

ఆహ్వాన పత్రికలు!
నిండా ఫొటోలు!
పోయి కూర్చొని పరికిస్తే
పోలిక పొంతన లేని వదనాలు!
పొరపాటున మరో సభకు
వచ్చామేమో అని పొగులు!

బానర్ చూసి ఇదేలే అని
నిట్టూర్పులు!

ఆధార్ కార్డు ఫొటోలు!
ఆదిమ మానవ చిత్రకళా
విన్యాసాలు!
కాదులే మరో మాట చెప్పండంటే
మోడర్న్ ఆర్టు కుంచెల హొయలు!
వేలిముద్రో కంటిపాపో అన్నారు
కానీ
ఫొటో ముఖం మాచ్ చేయమంటే
కృత్రిమ మేధ కూడా కుదేలు!

గమ్మత్తైన దాగుడు మూతలు
వెతుక్కొంటే ఎన్నో
వినో(మో)దాలు!
చేయకండీ సుమీ వివాదాలు!
ఎవరినీ ఉద్దేశించి కావీ
వ్రా(వా)తలు! ♦

42
ఉదార హృదయ విదారకం

మనిషన్నాక మనస్సులో
దయా దాక్షిణ్యం ఉండాలని
శత్రువైనా సరే ఉదారత చూపాలని
అన్నావు గదాని
ఓ పరంధామా
ఆశ్రయం ఇచ్చాను హృదయంలో

అరిషట్కానికి!
దూరినప్పుడు ఏకులు
తరువాత అవి మేకులై
హృదయమంతా ఆక్రమించి
ఆశ్రయమిచ్చిన ధర్మబుద్ధినే
తరిమేసాయి!
నా తప్పేముంది చెప్పు?! ♦

43
నాలో లేని నేను

నీరవం లో రవాన్ని
నీరాగంలో రాగాన్ని
నైల్యంలో ధావళ్యాన్ని
నాస్తిక్యంలో ఆస్తిక్యాన్ని
లేనిదాంట్లో ఉన్నవాణ్ణి
క్రిందటి క్షణం లేని వాణ్ణి
మరుక్షణం తెలియని వాణ్ణి
ఎప్పటికప్పుడు
తత్క్షణంలో బ్రతుకుతున్న వాణ్ణి
మిథ్యా జీవితంలో
అజ్ఞాన ధూర్వహుణ్ణి!
విధి గాలి ఎటు వీస్తే
అటు పోయే తృణ ప్రాయుణ్ణి!
కానంత వరకూ అనుభవవేద్యుణ్ణి
నిర్గుణుణ్ణి
నిర్మముణ్ణి
నిర్భవుణ్ణి
నిర్నిద్రుణ్ణి
లేనివాటిలో ఉన్నవాణ్ణి! ♦

44
లావణ్యం

కారు కడలికి ఒకటే గట్టు!
కన్నీటి మున్నీటికి రెండు గట్లు!
ఉప్పొంగితే ఏదైనా ఉపద్రవమే!
గట్లు రెండున్నా సుదతులైతే
సునామీనే!

పట్టెడు చక్కెర పొంగలి కైనా
చిటికెడు ఉప్పు పడితేనే జిహ్వాకు
వహ్వా!
అందుకేనేమో ఆనంద
బాష్పాలలోనూ
ఉప్పు పెట్టాడేమో అప్పింటి వాడు!

చేప కన్నీరు తుడిచే
సముద్రం!
చేయదు మొసలి కన్నీరు తుడిచే
సాహసం!

మనసు కన్నీటికి
మంచి తోడే మందు!
ఓటమి కన్నీటికి
మనోధైర్యమే మందు!

ఉప్పూ కారం తినని
అనిమిషుల కుంటాయా అశ్రులు
ఉంటే గింటే ఊరేనేమో
అమృత బాష్పాలు! ♦

45
నిర్భయం

కించిదానందం కలగ్గానే
దుఃఖం తెర్లుకొస్తుంది!
భయం!
ఇది శాశ్వతంగా ఉండదేమోనని!
కించిచ్ఛోకం కలగ్గానే
దుఃఖం పొర్లుకొస్తుంది!
భయం!
ఇదే శాశ్వతమై ఉండిపోతుందేమోనని!
ఔనూ....
నేనే శాశ్వతుణ్ణి కానప్పుడు
ఈ భయం గుఱించి భయమెందుకుటా? ♦

46
నీడకు తోడుగా

నా నీడ!
అదొక అసూర్యం పశ్య!
బయటకు పోతే
సూర్యుడికి
నన్నడ్డుగా పెట్టుకొంటుంది!
మాటుకు పోతే
మళ్ళీ నాలోకే దూరిపోతుంది!
వెలుగూ చీకటీ
ఏదైనా భయమే దానికి!
వెలుగులో నాతో ఉంటుంది
చీకట్లో నాలో ఉంటుంది! ♦

47
నిర్వికారం

ఆనందాలూ విచారాలూ
వస్తున్నాయ్!
బ్రతుకు బుక్ లో
విజిటర్స్ సంతకం చేసి
పోతున్నాయ్!
రానీ! పోనీ! నాకేం!
ఈ పుస్తకం ఓ నాడు
భస్మమౌతుంది!
రాకపోకల ఆనవాళ్ళూ
దానితోనే! ♦

48
విను నుడి

నేడు
నీల దంతంతో
చెవి మూసుకొని
దూర మానవ వాణిని
వింటున్నారు
నాడు
చేతి వేళ్ళతో
ముక్కు మూసుకొని
సుదూర దైవవాణిని
వినేవాళ్ళు! ♦

49
"పది"లంగా



అమ్మయ్య! లబలబ లాడిన
అజ్ఞాత వాసం ముగిసింది!
మళ్ళీ జనావాసాల్లోకి వచ్చేసాను
మీ జేబుల్లో నా గలగల
మీ చేతుల్లో నా తళతళ
వెలవెల బోయిన నా మొహం
మళ్ళీ మెరిసేను మిలమిల
గల్లాపెట్టెల్లో తోటి నాణాలతో
చిగురించిన చెలిమి కళకళ
మార్చ్యురీకి పోయిన బాడీలో
మళ్ళీ విరిసిన జీవకళ!
వద్దనుకొన్న వాళ్ళే చేరదీస్తే
ఆ ఆనందానికి ఉంటుందా వెల!
నా వెల పది రూకలే ఐనా
వేయి రూకల వెండి స్మారక నాణెంలా
సంతోషంతో పొంగి పోతున్నాను!
కాదా మఱి!!!
నాకు నేనే ఒక
స్మారకమైపోయాననుకొన్నా కదా మఱి! ♦

50
ప్రాగల్భ్యం!

ఓ సూర్యుడా!
నువ్వెంత భగభగ మండినా
నేనున్నంత వరకు
నా నీడను తాకనే లేవు సుమా!
నేనడ్డుంటాను!
ఓ ప్రచండ కారుమేఘమా!
నువ్వెంత కుంభవృష్టించినా
నేనున్నంత వరకు
నా నీడను తడుపనే లేవు సుమా!
నాలో దాచేసుకొంటాను!
ఓ ప్రళయ ఝంఝానిలమా!
నేనుండగా నా నీడను
వీసమైనా నానుండి వేరుచేయలేవు!
దాన్నెప్పుడూ అంటిపెట్టుకొనే
ఉంటాను!
నైనం ఛిన్దన్తి శస్త్రాణి ..
న శోషయతి మారుతః!
హ హ్హా! నా నీడకు నేనే నీడ! ♦

51
ఫటా ఫట్!

రోగికి దైహిక తాపం మితిమీరితే
థెర్మోమీటర్ ఫట్!
భోగికి ఐహిక తాపం మితిమీరితే
శరీరం ఫట్!
యోగికి ఆధ్యాత్మిక తాపం
మితిమీరితే
సహస్రారం ఫట్! ♦

52
లెక్క

విషం ప్రాగాలన్నా
ఓ లెక్కుంది!
చావటానికైతే
ఓ బిందువంత!
బ్రతకటానికైతే
మొత్తం సింధువంత!
(గుల్జార్ కవితకు అనుసరణ) ♦

53
వోటరి

ప్రొద్దుటే లేచి
నీటుగా తయారై
పోటు గాడిలా
క్యూ రూట్ లో నిల్చుని
నా వోటు దన్నుతో
ప్రజాస్వామ్యం పెట్టుజెట్టును
నిలబెట్టుదామని కలకంటూ
సిరాబొట్టు కోసం
వేలు ముందుకు పెట్టాలనుకొంటూ
లోపలికి అడుగుపెట్టే
లిస్టులో నా పేరుముందు టిక్కుంది!
మీరు వోటేసేసారు గదా!
మళ్ళీ ఎందు కొచ్చారంటూ
పొమ్మంటుంటే బిక్కచచ్చా
కటకటా!
నేనే మిథ్యంటూ నిన్నటి
ఆదిశంకరుల మాట!
నా వోటూ మిథ్యంటూ
నేడు తెలిసొచ్చిన మాట!
ఓరి దేవుడా!!
నా ప్రతినిధిగా పూజారితో
నీ అర్చన చేయించుకొంటున్నట్లు
నా వోటూ ఓ వోటరితో వేయించేసావా!
ఐనా ఓ నా దేవుడా!
నేనూ మొండినే!
రెండరు వోటు పూవుతో
ప్రజాస్వామ్యానికి పూజ చేసే తీరుతా!
(వోటు+అరి= వోటరి) ♦

54
బ్రతుకు పొత్తం

పుట్టినప్పటి నుండీ దినమొక పేజీగా
జీవన గ్రంథం వ్రాయటం మొదలెట్టాను
లిపి లేని మౌన భాషలో!
పాతిక వేల పైచిలుకు పేజీలైనాయి!
దాదాపుగా!
ఓ మారు పునరావలోకనం చేద్దామని
పేజీలన్నీ అలా ఓ సారి తిరగేసాను!
నేను వ్రాద్దామనుకున్నట్లుగా ఏదీ
ఏ పుటలోనూ కన్పించలేదు!
నేను వ్రాసిందే?! కాని
నేను వ్రాసుకొన్నది కాదు!
ఔను! బయోగ్రఫీలన్నీ
ఆటో- బయోగ్రఫీలే!
వ్రాయునది నేనట!
వ్రాయించెడివాడు పైవాడట!
కాదని మొరాయించటానికి
అవకాశమే లేదట!

♦

55
మనసు – మనువు

"మన ఏవ కారణం
బంధమోక్షయోః"
అన్నది వేదాంతం!
మనువేవ కారణం
బంధ మోక్షయోః
అంటున్నది జీవితం!
పెళ్ళి వయసు పెంచారు కాబట్టి
బ్రతికి పోయాం!
చేతలు కలవని చేతుల కలయిక
మనసులు కలవని మనువుల చేరిక
ఏడ్చుకొనే సీజన్
ఓ పుష్కరకాలం పోస్టుపోనైంది! ♦

56
సార్థకం

శివుడేమో
అర్ధ నారీశ్వరుడు
కేశవుడేమో
అర్ధనారీశ్వరుడు
బ్రహ్మమో
గ్రంథ నారీశ్వరుడు
నరుడేమో
స్పర్థా నారీశ్వరుడు
కాదు వివాహం విద్యా నాశాయ!
స్పర్థయా వర్ధతే విద్యా!
జీవితాంతం ఎంతో అంత
విద్యావంతుడౌతూనే ఉంటాడలా!♦

57
రివర్స్ గేర్!

పుట్టుక వద్దన్నాను
ఇచ్చావు!
అరిషడ్వర్గాలు వద్దన్నాను
దండిగా ఇచ్చావు!
సంసార పంకం వద్దన్నాను
ఊబిలోకే దించావు!
రోగాలూ రొష్టులూ
అప్పులూ సొప్పులూ
శోకాలు మనస్తాపాలూ
కష్టాలూ నష్టాలూ వద్దన్నాను
పుష్కలంగా ఇచ్చావు!
వద్దన్నదాన్ని అంటగట్టటం
కావాలన్నదాన్ని కాదనటం
ఓ దేవుడా! ఇదేగా నీ నైజం!
సరేలే! నీ పద్ధతిలోనే నువ్వుండు!
అన్నట్లు ఓ మాట!
నీ సన్నిధి నాకు ఇవ్వద్దు
వద్దంటే వద్దు!

♦

58
వ్యవ "సాయం"

ఎత్తి పోతల పథకాలు
అండగా
సాగు బడులకూ
దండిగా
సాహితి సాగుబడులకూ
ఒకదానికి
సహజ స్రోతస్వినులు!
మరోదానికి
పూర్వ పాండితీ స్రోతస్వినులూ!
బీడు భూములకూ!
బీడు బుఱ్ఱలకూ!

♦

59
సౌమనస్యం

గుండె తోట నిండా
మల్లెలు గులాబీలు
జాజులు సంపెంగలు!
పదుగురికీ పరిమళాలు
పంచుదామని చుట్టూ చూసా!
నా గుండెలో దూరి
ఆఘ్రాణించటానికి
సహృదయు లెవరూ
సిద్ధంగా కన్పించటం లేదు!
పాపం!
ఎవరి గుండె జబ్బుల్తో వాళ్ళు
సతమతమౌతున్నారు!

♦

60
రిహార్సల్

అగ్గి పుల్ల దీపంతో
తారాజువ్వను తిరిగి రాకుండా
ఆకాశంలోకి ఎగురవేస్తున్నాను!
చిన్న ఆనందం!
ఏదో నాడు హృదయ దీపంతో
ఆత్మ తారాజువ్వనూ
తిరిగి రాకుండా ఎగురవేస్తాను!
చిదానందం!
దీని కది పూర్వాభ్యాసం! ♦

61
రుచి 'భ్రమ' ణం

శ్రమజీవుల స్వేదం రుచి తో
సమానమైనది విశ్వంలోనే లేదు!
రహదారి ప్రక్క ధాబా లో
ఓ ఇడ్లీ ముక్క తిని చూడు!
ఒప్పుకోకుంటే నీదే తప్పు! ♦

62
వెంటాట

శౌచం సత్త్వం సత్యం
దానం ధర్మం భక్తి
నితాంతాపార భూతదయ
ఒంట ఉన్న వాళ్ళ వెంట,
తానుంటానని పరమాత్మ
చెప్తుంట!
మఱింకేమీ?
గుళ్ళ తిరుగుళ్ళు
కొబ్బరి కాయ కొట్టుళ్ళు
పుణ్య నదుల్లో మునుగుళ్ళు
తీర్థ క్షేత్రాల పరుగిళ్ళతో
భగవంతుడి వెంట పడే బదులు
ఆయన్నే నీ వెంట పడేట్లు చేసుకో!
మాధవ సేవకై
మార్గాన్ని మార్చుకో!
పై ప్రదర్శనం మానేసి
లో నిదర్శనం చూపించుకో!
లోని దర్శనం చేసుకో! ♦

63
స్పృహ

ఎంతసేపు కుంభించినా
ప్రాణాయామంలో
రేచించక తప్పదు
ఎంత సంపాదించుకొన్నా
జీవన తుది యామంలో
త్యజించిక తప్పదు
ఆ సంగతి నెరిగిన వాడికి
అసలుతో సంగతి
అరచేతి ఆమలకం!
♦

64
వేడ్కోలు

ఓ దేవుడా!
నేను ముసలాడి నైపోతున్నానన్నది నీకు
తెలిసిందే!
అతి వాగుడు, రాగబంధాలనుంచి
నన్ను దూరంగా ఉంచు!
ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకొనే
అలవాటును తప్పించు!
ప్రతి వాడి వ్యవహారాలను చక్కదిద్దాలనే
కుతి నుంచి విముక్తుణ్ణి చెయ్యి!
అంతులేని సాగతీతలు మాని సూటిగా
అసలు విషయం చెప్పేలా తీర్చిదిద్దు!
దినదినాభివృద్ధి చెందే నా బాధల్నీ
దుఃఖాల్నీ
వెల్లడించకుండా నాకు వాగ్బంధనం
చెయ్యి!
రోజు రోజుకూ వాటిని అందరికీ
చెప్పాలనే యావ తీవ్రతరమైపోతోంది!
మాటి మాటికీ ఇతరుల కోసం నేనేమేం
చేసానో చెప్పకుండా
మౌనంగా నాలో నేనే ఆ మేళ్ళను
నెమరు వేసుకోనీ!
నేనూ అప్పుడప్పుడూ తప్పులు
చేస్తూంటాననే పచ్చి నిజాన్ని నాకు
అర్థం అయ్యేలా చెయ్యి!
ఆలోచనాపరుణ్ణి చెయ్యి కాని
ఇతరుల ఆంతరంగిక జీవితాలలోకి
చొరబడనీకు!
సహాయపడనీ కాని అధికారం
చెలాయించనీకు!

కానీ ఓ దేవుడా! వీడ్కోలు కాలానికి
ఒకరిద్దరు స్నేహితులైనా నాకు
ఉండేటట్లు మాత్రం చెయ్యి!

(మూలం: ప్రసిద్ధ తొలి హృచ్ఛస్త్రచికిత్సా నిపుణుడు కీ.శే. డా. జాన్ వెట్టత్ (కేరళ) రచన ఆంగ్ల కవిత A Prayer) ♦

65
శయనైకాదశి

అమ్మయ్య
నారాయణుడు నిద్దరోయాడు!
ఇంక నిర్భయంగా
ఎన్ని పాపాలైనా చేసేయొచ్చు
నాల్నెల్లపాటు ఇష్టా రాజ్యం అనుకొన్నా!
అంతా నాటకం!
ఆకాశం వైపు చూస్తే అర్థమైంది!
నారాయణ! నారాయణ!
ఇలా పగలూ రాత్రీ
కళ్ళు తెరుచుకొనే నిద్రపోతారా ఎవరైనా?♦

66.
శపథం

నా రాక రోజున
నా ఏడుపుకు
మీరంతా నవ్వులతో
సెలబ్రెట్ చేసుకోవటం విన్నా!
నా పోక రోజున మాత్రం

మీలో ఏ ఒక్కరినీ అలా
చేసుకోనివ్వను గాక
చేసుకోనివ్వను!
అదే నా జీవితాశయం! ♦

67
సత్యాన్వేషణ

పుస్తకాన్నీ, మనసునూ
ఎల్లప్పుడూ
తెరచి చదువుకొంటూండాలి!
నెమరు వేసుకొంటూండాలి!
విజ్ఞానానికి వివేకానికి
సత్యానికీ సత్త్వానికీ
సంధాయకాలు అవే!

పుస్తకపు పుటలను
మనసు పొరలను
పరిరక్షించుకోవాలి!
ఎదకు చెదలు పట్టినా
పుస్తకానికి పురుగు పట్టినా
కోల్పోయేది
ఒక జీవిత పరమార్థాన్ని!
♦

68
హృదయంగమం

అంజనా సుతునికి
సీతారాములు గుండెలో
ఉన్నారట!
సీతారాములకైతే
ఒకరి కొకరు గుండెగా ఉన్నారట!
అందుకే వియోగంలో

రాముని గుండె రామా రామా
సీత గుండె సీతా సీతా
అని విలపించాయట!
ఇది "పర" బ్రహ్మ రహస్యం
వారిద్దరికే తెలిసినది!
ష్! ఎవరికీ చెప్పకండేం! ♦

69

సభ రభస

"ఇలా చెయ్యి లలా చెయ్యాలంటూ!
ఔను! చెయ్యాలి! చెయ్యాలంటూ!"
వేదికపై
పది మంది మైకాసురల తాండవాలు!
లాస్యాలు!
"వచ్చి ఇరుక్కొన్నాం ఏం చేస్తాంలే!" అని
మూడు గంటల పాటు మూలుక్కొంటూ
వేదిక ముందున్న ఐదారుగురి
ఆవలింతల ఆపసోపాలు
"చేతనైతే చేసుకొందురూ!
వుయ్ డోన్ట్ బాదర్"
ఈ బాదరబందీ తంతు లోకి గెంతకుండా
ఇంట్లోనే కునుకు తీస్తున్న మిగతా వాళ్ళు!
"పూర్ అవేర్నెస్! నెక్ష్టియర్
వుయ్ షుడ్ ట్రై టు డూ బెటర్!"
మూడున్నర గంటల తర్వాత
సభాంతంలో మేల్కొన్న అధ్యక్షుని
మలిపలుకులు!
'మనంతటి వారలం వేదిక మీదున్నా
పట్టుమని పది చెవులైనా లేవే" అని
వేదికాసీనులందరికీ ఓ గుబులు!
మర్నాడు పేపర్ చూసి
"నేనన్నది ఒక్కలైనూ రాలేదే" అని
అదో దిగులు!
"చెప్తే వినే వాళ్ళే రానప్పుడు
వ్రాస్తే చదివే వాళ్ళెవరుట?
ఇంత చిన్న లాజిక్ ఎలా
మిస్సవు"తారంటూ
కొందరు ప్రకాష్ రాజ్ ల గుసగుసలు!
మరో తత్ దినానికి సమాయత్తమౌతున్న
అలవాటైపోయిన వక్తలు!
ప్రతి రోజూ ఏదో ఓ దినం!
కొన్ని రోజులైతే నాలుగైదు కూడా!
సందులో సభ! గొందిలో సభ!
తొలి పొద్దునో సభ! మలి పొద్దునో సభ!
అక్కడో సభ! ఇక్కడో సభ!
అవే ముఖాలు! అవే మాటలు!
భోజనాలు పెట్టాం రారండో
అన్నా భోక్తలుగా నైనా రాని శ్రోతలు!
అందుకే నేమో పత్రికల్లో
వేదిక పైని ఫొటోలే తప్ప
వేదిక క్రింది ఫోటోలుండవు!
సభలంటే కుర్చీలు బల్లలు కాదోయ్!
రసిక హృదయాలు విరాజిల్లాలోయ్!
ఏ సభ చూసినా ఏమున్నది
గర్వకారణం?
శ్రోతృపీడన పరాయణత్వం!
ఈ ఐదారుగురైనా రాని రోజులు
ముందున్నాయేమో?
అ(ఆ)సందర్భంగానైనా
అర్జంటుగా నేనూ ఓ సభ పెట్టేయాలి!
ఈ లోపే! ♦

70
సెల్ఫీ

(కథా కవిత)

"అదేమిటి ఇలా చెప్పా పెట్టకుండా
ఊడిపడ్డావ్!"
"సరదాగా సర్ప్రైజిద్దామనీ..."
"అంత ప్రేమ అకస్మాత్తుగా ఎందుకు ముంచుకొచ్చిందో..?"
"నువ్వు నన్ను పట్టించుకోవటం లేదని!"
"నీ సాంగత్యం కోసం అల్లాడేవాళ్ళు చాలామందే ఏడుస్తున్నారు గదా!"
"మనసులో లేకుండా పైపైన ప్రేమలొలకబోసే వాళ్ళు నాకెందుకు?"
"నేనే నువ్వు నువ్వే నేనంటూ కల్లబొల్లి మాటలంటూ
కన్పించకుండా ఉంటే అలాగే ఉంటారు మరి!"
"ఇప్పుడూ అదే అంటాను. నువ్వే నేను నేనే నువ్వు!"
"ఎప్పుడూ వినేదేగా! కొత్తేముంది గనుక!
"ఐతే నువ్వూ నన్ను నమ్మట్లేదా?"
"ఎదురూ బొదురుగా వేర్వేరుగానే ఉన్నాం కదా?"
"సరే! తెలిసే క్షణం ముందుందిలే! ఇంక వస్తా మరి!"
"ఉండుండు! నువ్వొచ్చావన్నందుకు గుర్తుగా ఓ ఫొటో తీసుకొంటా!
అందరికీ తెలియ చెప్పటానికి!"
"నన్నొక్కణ్ణే తీస్తే నమ్మరేమో
నాతో సెల్ఫీ తీసుకో!"
"ఈ ఆలోచనేదో బాగుంది! సరే! ఇలా రా!"
క్లిక్....
"ఇక నే వెళ్ళొస్తా!"
అరె! వెళ్ళిపోయాడే!
ఈ సెల్ఫీ సరిగా వచ్చిందో లేదో? ...

ఇదేమిటీ వింత!!!
ఈ సెల్ఫీలో ఇద్దరిగా నేనే ఉన్నాను!!!
నాన్నకు దాన్ని వాట్సాప్ లో పంపాను
వింత గురించి చెప్పాలని మెసేజ్ టైపు చేస్తుంటే..
నాన్న రిప్లై వెంటనే..
"నువ్వూ నేనూ ఎప్పుడు సెల్ఫీ తీసుకోలేదే?
ఇది AI సృష్టా?"
ఓ పరమాత్మా!
ఏంటో అనుకొన్నాను!
నువ్వూ చాలా చిలిపివే!
రిప్లై మెసేజ్ పెట్టా!
"ఔను నాన్నా! అది
Absolute Intelligence సృష్టి!" ♦

71
పాణిగ్రాహి

దాహముండదు ఆకలుండదు
నిన్ను చూస్తుంటే!
ధ్యాస ఉండదు వేరే ఆశ ఉండదు
నీతో నే ఉంటే !
పగలు తెలియదు రాత్రి తెలియదు
నిన్ను వేళ్ళతో తడుముతూంటే!
కోయిల పాటే అనిపిస్తుంది
చెవిలో నువ్ చెప్పేది వింటుంటే!
ఒక్కడే ఐన పరమాత్మ స్ఫురిస్తుంది
అనేకానేక రూపాలలో నిన్ను
చూస్తుంటే!
ఏం కావాలింకా!
ఆమరణాంతం నీ తోడుంటే..!
....
ఎవరి గురించి అనుకొంటున్నావు
ఓ పఠితా?
ఎప్పుడూ నువ్ చేపట్టే ఆ
చిన్న "దాని" గురించే సుమీ!! ♦

72
అంతిమ యాత్ర

నిన్న మొన్నటి దాకా..
బారెడు జడతో
వంటినిండా పచ్చని వలువలతో
సిల్కు దారాల పరదా చాటున
గోరు తగిలితే పాలుగారే
నాజూకు శరీరంతో
అతిగుట్టుగా అలరి
నేడిలా....
శత్రురాజులకు చిక్కకుండా
ఆత్మాహుతి చేసుకొంటున్న
అంతిపురి అతివల్లా... ♦



73
అంతు తంతు

మొదటి భూతానికి చిల్లి పడింది
రెండో భూతం బయటకురికి
చుట్టూ తిరిగింది
మూడో భూతం ముట్టుకొంది
నాలుగో భూతం
చేయూతనిచ్చింది
ఐదోభూతం పర్యవేక్షించింది
నువ్వెవరివైనా
చివరికి నీ కర్మ అంతే! ♦

74
ట్రంపరితనం

దేశాలమధ్యేనా కొట్లాటలు?
ఎంతమంది భార్యాభర్తల మధ్య
యుద్ధం ఆపానో నేను!
అజ్ఞాత గృహఖైదీగా ఉంటూ!
ఇంట్లో యుద్ధం చేసుకొంటూ!
ఇంత నోబుల్ పర్సన్ని నన్ను
నోబెల్ కమిటీ
గుర్తించ దదేమిటో మతి!
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ♦

75
అభ్యాసం

పరీక్షలు పాసైనా డాక్టర్లు
చేస్తూనే ఉంటారు ప్రాక్టీస్
అందుకే పేషెంట్లు
కొందరు ఇంటికి
కొందరు మింటికి
పరీక్షలు పాసైనా లాయర్లు
చేస్తూనే ఉంటారు ప్రాక్టీస్
అందుకే క్లయింట్లు
ఆస్తులు పెరుగు కొందరికి
అప్పులు పెరుగు కొందరికి
క్రింది కోర్టుల్లో తీర్పు
పై కోర్టుల్లో మార్పు
ఏ పరీక్షలూ పాసు కాని
నేనూ చేస్తున్నాను
జీవితం ప్రాక్టీస్
అనుకూలాలు కొన్ని
ప్రతికూలాలు కొన్ని
ప్రాక్టీసుతోనే గడిచి పోయేను
జీవితం!
ఎప్పటికీ కా(లే)ము నిష్ణాతులం!
ఇది దేవుడి సృష్టి ప్రాక్టీస్! ♦

76
ఎదగండు

ఈ నెలవంక
ఓ వెన్నెల వెన్న పూసిన కత్తి!
ఎంతమంది ప్రేయసీ ప్రియుల
వలపు గుండెలను కోసిందో!
ఆ మిలమిల లాడే తారకలన్నీ
ఆకాశంపై చిందిన
ఆ హృదయాలలోని
ప్రేమామృత బిందువులే! ♦



77
బాహుబలి



ఎన్నెన్ని జీవరాశులు
ఈ చరాచర జగతిలో!
విచిత్రం!
ఏ ప్రాణికీ తన జీవితం
తన చేతుల్లో లేదు!
అంతా పై వాడి చేతుల్లోనే!
అందుకేనేమో
ఆయనకు అన్ని చేతులు! ♦

78
చేలి చిత్రాలు

చేలికి తట్టుకోలేని నిప్పు కణిక
బూడిద కంబళిని కప్పుకొంది!
భస్మంతో విరాజిల్లే
మహాదేవుని ఫాలాన
మూడో కన్నులా ముడుచేక
పడుకొంది!

చేలికాంత చుంబన పీడతో
పెదాలు పగులుతుంటే
ఇల్లాంద్రకు అనుమానం
పెనుభూతమౌతోంది!

చేలికి తాపం చచ్చిన పూలు
పరాగసంపర్కవిముఖములై
పిందె వేయక రాలిపోతుంటే
సాగు దిగుబడులు
తగ్గిపోతున్నాయి!

సూర్యుడు
స్వెటరు మంకీ కాప్ తొడుక్కొని
రోజువారీ డ్యూటీ
ఏదో చేసేసాననిపిస్తుంటే
ఎండలో చురుకే లేకుండింది! ♦

79
నిత్యావధానం

తాత మామ్మ పురాణపఠనం
తలిదండ్రులు నిషేధాక్షరి
భార్య సమస్యాపూరణం
పిల్లలు దత్తపది
అల్లుళ్ళు ఆశువు
కోడళ్ళు వ్యస్తాక్షరి
మనవ(రా)ళ్ళు ఘంటానాదం
పడక దిగిన దగ్గర్నుండీ
మళ్ళీ పడకెక్కే దాకా
నిన్నటి వంతలు
రేపటి చింతలతోనే
నేడంతా గడిచి పోయే
జీవితాష్టావధానంలో
నా పాత్ర ఎప్పుడూ
అ'ప్రస్తుత'మే! ♦

80
బాలేయం




ఇల జలబుద్బుదాలతో
ఆడుకొంటోంది ఈ అమాయిక బాల!
బాలానందం!

అల జీవబుద్బుదాలతో
ఆడుకొంటోంది ఓ మాయిక "బాల"!
బ్రహ్మానందం!! ♦

81
విన్నానులే ప్రియా!

కలలనే కళ్ళుగా
చేసుకొన్న ఓ సుందరీ
ముంగురు తంత్రుల
చెవి వయొలిన్ పై
నీ కాటుక క్రేగంటి
చూపు కమానుతో
నువ్వు పలికిస్తున్న
నీరవ వలపు గీతం
విన్నానులే ప్రియా! ♦



చిత్ర సౌజన్యం
శ్రీ AVVS కామరాజు, Ex GM (ONGC)





82
దండమయా...

దండం పెట్టితే
ఎవరైనా వశులౌతారు!
దండం పట్టితే
ఎవరైనా సాగిలబడతారు!
దండమా
నీకో దండం!! ♦

83
మౌని

మౌనం
రూపు దాల్చితే
గుళ్ళో దేవుడు!
ఇంట్లో మొగుడు!
అందుకే కాబోలు
"పతి దేవుడ"న్నారు! ♦



84
అంతేగా మఱి

ఎంత పెద్ద వినాయకుడైనా
నీటిలో కరగాల్సిందే!
ఎంత పెద్ద నాయకుడైనా
మట్టిలో కలవాల్సిందే! ♦

85
ట్రంపెరికం

నిన్నటి వరకూ...
వరుడు
అమెరికాలో సాఫ్టవేర్ ఇంజినీరంటే
వధువుకు
sweet dreams!

నేడదే ముక్క చెపితే....
sweat dreams!!
ట్రంపెరికం లో ఉన్న మజా
అనుభవించితే.. అది తెలియునులే!!
♦

86
ఉత్తమ ద్వార దర్శనం

గుండె గుడిలో
కొలువై ఉన్నావని
వైకుంఠ ఏకాదశీ దర్శనానికై
చుట్టూ ప్రదక్షిణించాను!
ఎక్కడా ఉత్తరద్వారం
కన్పించలేదు!
అసలు ద్వారమే లేదు!

అంతా "గందర" గోళమే!
లోపలనుంచి చప్పుడు మాత్రం
వినిస్తోందేదో!
కనిపించకపోయినా
వినిపించే ఆ నాద బ్రహ్మనికి
బయటనుండే ప్రణమిల్లాను!
గోడలూ ద్వారాలూ లేని భక్తితో!
♦

87
ఉద్దీప్తి



చీకటి మకిలి పట్టి పట్టి
నల్లగా మాసిందని
అంబరాన్ని నేలకేసి బాది
ఉతికి ఆరేసాను!
ఏనాటిదో అది కాని
అంతగా చివికి పోయిందనుకోలేదు!
ఎన్ని కంతలు పడ్డాయో!
వాటిల్లోంచి
పెంజీకటి కావలి వెల్గు మిన్కులు
దీపిస్తూ.....! ♦

88
సంసారంలో బిస పసలు

దాంపత్యం
ఓ క్లిప్పు లాంటిది!
ఆలు మగలు
క్లిప్ కుండే రెండు పార్శ్వాలు!
అతుక్కునేలా చేసే స్ప్రింగే
అనురాగం
అది పనిచేస్తున్నంత వరకూ
రెండు పార్శ్వాలూ
గాఢంగా అతుక్కొనే ఉంటాయి!
బలంగా విడదీసినా
మళ్ళీ యథావిధిగా
అతుక్కుపోతాయి!
అలాగే అనురాగం కూడా!
అపార్థాల ఒత్తిడితో
కొంచెం సేపు లుప్తమైనా
మళ్ళీ యథాస్థితికి రావాలి!
అందుకే
క్లిప్పులో బిస ను
తుప్పు పట్టనీయకండి!
దాంపత్యంలో పస ను
ఆవిరి కానీయకండి! ♦

89
అంజలిదే కొనుమా



మంచు ముంచేసి
రాత్రంతా చలితో
వణికి పోయిన తనపై
నులివెచ్చని వెలుగు వలువ
దుప్పటిని పరిచి


కరుణించిన సహస్ర కిరణమాలికి
తన సహస్రారుణారవింద కరాలతో
అనేక ధన్యవాదాంజలులు ఇస్తోంది
కొండంత భక్తితో కోనేరు! ♦

90
శేషప్రశ్న

జీవుని వేదన
ఓ కవి సమ్రాట్టుకి
ఎద సొద!
జీవుల వేదన
ఓ మహా కవికి
ఎద సొద!
అమలిన శృంగార భావన
ఓ భావకవికి
ఎద సొద!
రాత్రి కురిసే అమృతపు వాన
ఓ కవితిలకుని
ఎదసొద!

సంగీత జ్ఞానము భక్తి వినా..
ఓ వర వాగ్గేయకారుని
ఎదసొద!
ప్రతి కలానికీ ఓ ఆలోచన!
ఎవరి దారి వారిది!
ఎవరి గోడు వారిది!
పట్టుకొంటే పఠిత మది
అది ఎద సుధ
కాకుంటే అడవి రొద!
పొందినా జనాదరణ
కవిత్వంతో జనోద్ధరణ
ఎప్పటికీ ఒక శేష ప్రశ్న!? ♦

పితరౌ వందే రాజ్యలక్ష్మీకామేశ్వరౌ



వాస్తుజ్యోతిష విద్వాన్, దైవజ్ఞ రత్న,

కీ.శే. బ్రహ్మశ్రీ కవితా కామేశ్వరశర్మ,

కీ.శే. రాజ్యలక్ష్మి

ఈ బ్రతుకు చెట్టుకు మీరు వేళ్ళు
మీరు నేర్పిన విలువలు పోసిన నీళ్ళు
పెట్టి పూజిస్తున్నాను మీ పాదాలు
ఈ తరువున వికసించిన అక్షర సుమాలు
చల్లండి చాలు మీ దీవనల సేసలు
అవే నడిపిస్తాయి నే నున్నన్నాళ్ళు!



రచయిత పరిచయం

రచయిత:	కవితా (వేంకట సూర్య నారాయణ) ప్రసాద్
జననం:	1955
ఊరు:	అవనిగడ్డ, కృష్ణాజిల్లా (ఆం.ప్ర)
తల్లిదండ్రులు:	వాస్తు జ్యోతిష విద్వాన్, దైవజ్ఞరత్న బ్రహ్మశ్రీ కవితా కామేశ్వర శర్మ, రాజ్యలక్ష్మి.
చదువు:	MSc (chemistry), (PhD), PG Dip. (Appd. Statistics) స్కంధ త్రయ జ్యోతిషము (వారసత్వము).
వృత్తి:	D.G.M (retd.), ONGC.
అభినివేశము:	పద్య, వచన కవిత్వములు, కథారచన, వాస్తు జ్యోతిష ముహూర్త శాస్త్రములు.
రచనలు:	వివిధ పత్రికలలో పద్య గద్య కవితలు, కథలు, వ్యాసాలు, ఆకాశవాణి పద్య సమస్యాపూరణలు, వివిధ కవితా సంకలనములలో రచనలు.

గ్రంథములు:
శ్రీ రాజశేఖర శతకము,
శ్రీ వేంకటేశ్వర ద్విశతి,
కొరోన వారణార్థనా పద్యపంచాశిక,
కావవే కామేశ్వరీ!! (శతకము),
ప్రవచన కవితా (౨) కవితలు (వచన కవితా సంపుటి),
మాటవెలదులు (పరశ్శతకము),
ప్రపద్యాపీడము (ఖండ పద్యకవితా సంపుటి),
ఇష్టకథాష్టకము (కథాసంపుటి),
శ్రీ లలితా మధురాక్కరలు
ముహూర్త కామేశ్వరము,
పచన కవితలు,
సౌందర్యలహరి (నుడిమార్పు),
ఎద సొద (వచన కవితా సంపుటి).